సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 30.07.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 269
పేజీలు: 08 వెల: రూ. 5

## తెలంగాణ ప్రాజెక్టులకు
# గ్రీన్ సిగ్నల్
### సుప్రీం తీర్పుతో రైతుల్లో హర్షం




- పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లిలకు ఊరట
- పర్యావరణ అనుమతుల వివాదానికి ముగింపు
- ఇప్పటికే ఇచ్చిన అనుమతులు మాత్రం చెల్లుబాటు
- ఆగిపోయిన ప్రాజెక్టు పనులకు ఊపిరి.. నిర్మాణాలు వేగవంతం
- వేలాది ఎకరాలకు సాగునీరు, కోట్ల మందికి తాగునీటి ఆశలు
- ఆఫీస్ మెమోతో చట్టాలను మార్చలేరని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

02

# రాహుల్ వర్సెస్ బీజేపీ
### విద్యార్థుల అణచివేతకు అమిత్ షా ఆదేశాలు

- లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై దుమారం
- ఆర్ఎస్ఎస్‌పై విమర్శలు
- బీజేపీ కౌంటర్
- రికార్డుల నుంచి తొలగింపు

**ముద్ర, న్యూఢిల్లీ:** లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు బుధవారం రాజకీయ దుమారానికి దారితీశాయి. పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్న రాహుల్ గాంధీ.. మిగతా 02లో



## కాంగ్రెస్ కొత్త హౌసింగ్ అస్త్రం!
### జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు లక్ష ఇళ్ల ప్రకటన
### కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఫార్ములానే అమలు చేస్తున్నారా?

- గ్రేటర్‌లో 'ఇందిరమ్మ ఇళ్లు'...
- పాత డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీపై కొనసాగుతున్న ఉత్కంఠ
- జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు హౌసింగ్ రాజకీయాలు
- ఇందిరమ్మ ఇళ్లతో ఓటు బ్యాంకుపై కాంగ్రెస్ గురి
- దరఖాస్తుల రాజకీయమా.. నిజంగా ఇళ్లు ఇస్తారా?
- గ్రేటర్‌లో హౌసింగ్ కార్డుతో కాంగ్రెస్ ఎత్తుగడ
- ఇల్లు హామీతో జీహెచ్ఎంసీ పోరుకు కాంగ్రెస్ సిద్ధం
- రూ.6 లక్షల వాటాతో ఇందిరమ్మ ఇళ్లపై సందేహాలు
- హామీలు కాదు.. తాళాలు ఇస్తేనే ఓట్లు!




**ముద్ర డెస్క్:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో 'ఇల్లు' అనేది ఎప్పటి నుంచో అత్యంత ప్రభావం చూపే రాజకీయ అంశంగా కొనసాగుతోంది. నగరంలో సొంతిల్లు లేని లక్షలాది మంది పేదలు, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు ఇళ్ల హామీ ఇవ్వడం ద్వారా రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. గత రెండు దశాబ్దాలుగా జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే హౌసింగ్ హామీలు రాజకీయంగా కీలక పాత్ర పోషించాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతూ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించడం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ నిర్ణయం తీసుకోవడం యాదృచ్ఛికమా? లేక గ్రేటర్‌లో బలమైన స్థానం సంపాదించేందుకు కాంగ్రెస్ అమలు చేస్తున్న రాజకీయ వ్యూహమా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీ మధ్య ఉన్న ఓటు బ్యాంకులో చీలిక తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ హౌసింగ్ కార్డును తెరపైకి తీసుకొచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**కేసీఆర్ ఫార్ములానేఅమలు చేస్తోందా?**

తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించింది. నగరంలో లక్షలాది మంది దరఖాస్తులు చేసుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించింది. సర్వేలు, లబ్ధిదారుల ఎంపిక, కొత్త దరఖాస్తులు, పరిశీలనలు అంటూ ఏళ్ల తరబడి కార్యక్రమాలు కొనసాగాయి. ఇళ్ల నిర్మాణం ఆశించిన వేగంతో సాగకపోయినా 'ఎప్పటికైనా మనకూ ఇల్లు వస్తుంది' అనే ఆశను ప్రజల్లో బలంగా నాటడంలో బీఆర్ఎస్ సఫలమైంది.ఈ భావోద్వేగమే 2016, 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు రాజకీయంగా ప్రయోజనం చేకూర్చిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దరఖాస్తుల ప్రక్రియను కొనసాగిస్తూ ప్రజలను నిరంతరం ప్రభుత్వంతో అనుసంధానంలో ఉంచడం అప్పట్లో బీఆర్ఎస్‌కు కలిసి వచ్చింది.

ఇప్పుడు కాంగ్రెస్ కూడా దాదాపు అదే తరహా వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. లక్ష ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన, దరఖాస్తుల ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాలు చూస్తే బీఆర్ఎస్ అనుసరించిన రాజకీయ ఫార్ములానే కాంగ్రెస్ మిగతా 02లో



# పేపర్ లీకులకు చెక్

- పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు–2026కు ఆమోదం
- పరీక్షల పారదర్శకతకు కేంద్రం కీలక అడుగు
- లీక్‌లపై కఠిన చట్టానికి లోక్‌సభ గ్రీన్ సిగ్నల్
- విపక్షాల నిరసనల మధ్య బిల్లు ఆమోదం
- పేపర్ లీక్‌లపై కేంద్రం మరింత కఠినం
- పరీక్షల్లో అక్రమాలకు ఇక భారీ శిక్షలు
- విద్యార్థుల భరోసాకు కొత్త చట్టం

**ముద్ర, ఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్ సవరణ బిల్లు, 202 కు లోక్‌సభ బుధవారం ఆమోదం తెలిపింది. దేశంలో పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచడం, ప్రశ్నాపత్రాల లీకేజీలు , ఇతర అక్రమాలకు శాశ్వత ముగింపు పలకడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని మరింత బలోపేతం చేస్తూ ఈ కొత్త సవరణలను సభ ముందుకు తెచ్చింది. విపక్షాల నిరసనలు, హంగామా మధ్యనే ఈ కీలక బిల్లును లోక్‌సభ వాయిస్ ఓట్ ద్వారా ఆమోదించింది.

ఈ బిల్లుపై జరిగిన చర్చలో కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పరీక్షల ప్రామాణికతను, విశ్వసనీయతను కాపాడేందుకు కేంద్రం ఎంతటి కఠినమైన నిర్ణయాలకైనా వెనుకాడదని స్పష్టం చేశారు. నీట్ పేపర్ లీక్ ఘటనపై ప్రభుత్వం ఎంతో వేగంగా స్పందించి చర్యలు తీసుకుందని గుర్తుచేసిన ఆయన, మిగతా 02లో

# జల విలయం
### ఉగ్రరూపం దాల్చిన బ్రహ్మపుత్ర, గోదావరి



- అస్సాంలో మహా వరదలు..
- తెలంగాణలో ఉప్పొంగుతున్న గోదావరి
- అస్సాంలో 6.54 లక్షల మందిపై ప్రభావం.. 71 మంది మృతి
- కాళేశ్వరం వద్ద పెరుగుతున్న గోదావరి ప్రవాహం
- మేడిగడ్డ బ్యారేజీ 85 గేట్లు ఎత్తివేత

**ముద్ర హైదరాబాద్:** దేశంలోని పలు రాష్ట్రాలను ఎడతెరిపి లేని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ఒకవైపు అస్సాంలో బ్రహ్మపుత్ర నది ఉగ్రరూపం దాల్చి భారీ వరదలు సృష్టిస్తుండగా, మరోవైపు మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వరదల కారణంగా వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, అధికారులు మిగతా 02లో



## తూర్పు కనుమల్లో కొత్త వృక్ష జాతి
### తిరుపతి కొండలలో అరుదైన మొక్క

02

- సువాసనలు వెదజల్లడమే దీని ప్రత్యేకత
- క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్‌గా పేరు పెట్టిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్!

# యువతిపై లైంగికదాడి

నిందితులను నడిరోడ్డుపై చితక బాదిన జనం

ఉత్తరాఖండ్‌లో ఉద్రిక్త పరిస్థితులు

02



# భారత్‌కు అమెరికా షాక్
### రష్యా చమురుపై అమెరికా ఆంక్షల బిల్లు

02




- 100% టారిఫ్‌ల ముప్పు..
- భారత్‌పై పడనున్న పరోక్ష ప్రభావం
- ఇంధన భద్రతపై ఆందోళన..
- ట్రంప్ వ్యూహంతో భారత్‌కు సవాళ్లు
- ద్రవ్యోల్బణం నుంచి ఎగుమతుల వరకు.. భారత్‌పై తీవ్ర ప్రభావం?

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 30.07.2026
www.mudranews.in | @mudranews



### టీని 30 రోజులు మానేస్తే..



టీలోని కెఫిన్ ప్రభావం తగ్గడంతో రాత్రిళ్లు ప్రశాంతంగా, గాఢమైన నిద్ర పడుతుంది. నిద్రలేమి సమస్య కూడా తగ్గే అవకాశం ఉంటుంది.

# కాంగ్రెస్ కొత్త హౌసింగ్ అస్త్రం!

(మొదటి పేజీ తరువాయి)

కూడా ప్రయోగిస్తోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఇంకా బలమైన రాజకీయ ఆధిపత్యం లేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రధాన ప్రత్యర్థిగా ఉండగా, బీజేపీ కూడా నగరంలో తన ప్రభావాన్ని పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో నగరంలోని పేదలు, అద్దె ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు, సొంతిల్లు కోసం ఎదురుచూస్తున్న యువతను ఆకర్షించేందుకు కాంగ్రెస్ హౌసింగ్ అంశాన్ని ప్రధాన అజెండాగా మార్చినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం రూ.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీతో 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫ్లాట్లు నిర్మిస్తామని చెబుతోంది. భారీ ఎత్తున దరఖాస్తుల స్వీకరణ ద్వారా ఎన్నికల వరకు ప్రజల్లో చర్చ కొనసాగేలా చేయడమే కాకుండా, లబ్ధిదారుల జాబితా, సర్వేలు, ఎంపిక ప్రక్రియ ద్వారా ఓటర్లతో ప్రత్యక్ష సంబంధాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**డబుల్ ఇళ్ల పరిస్థితి ఏమిటి?**

ఇందిరమ్మ ఇళ్ల ప్రకటనతో మరో కీలక ప్రశ్న కూడా ముందుకు వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కొల్లూరు, రాంపల్లి, జవాహర్‌నగర్ తదితర ప్రాంతాల్లోని వేలాది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందలేదు. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయినా పంపిణీ కాలేదు. మరికొన్ని చోట్ల పనులు నిలిచిపోయాయి. ఈ ఇళ్లను పూర్తి చేసి పంపిణీ చేస్తే బీఆర్ఎస్‌కు రాజకీయంగా క్రెడిట్ వెళ్తుందనే భావన అధికార పార్టీలో ఉండే అవకాశముందనే చర్చ కూడా సాగుతోంది. అందుకే పాత ఇళ్ల పంపిణీ కంటే కొత్త ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ముందుకు తీసుకువస్తోందా? అనే ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ప్రజల దృష్టిలో మాత్రం పాత ఇళ్లను త్వరగా పంపిణీ చేయాలనే డిమాండ్ బలంగా ఉంది. ఇప్పటికే నిర్మించిన ఇళ్లను ఖాళీగా ఉంచి కొత్త ప్రాజెక్టులు ప్రకటించడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న కూడా ఉత్పన్నమవుతోంది.

**లబ్ధిదారుడికి రూ.6 లక్షల భారం**

కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పూర్తిగా ఉచితంగా ఇస్తామని చెప్పింది. కానీ కాంగ్రెస్ తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో లబ్ధిదారుడు సుమారు రూ.6 లక్షలు భరించాల్సి ఉంటుంది. ప్రభుత్వ సబ్సిడీ రూ.5 లక్షలు మాత్రమే ఉండగా, మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుడే సమకూర్చుకోవాలి. అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు, అసంఘటిత రంగ కార్మికులు, చిరు ఉద్యోగులు ఈ మొత్తాన్ని సమకూర్చుకోవడం ఎంత వరకు సాధ్యమవుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకు రుణాలు పొందేందుకు కూడా ఆదాయ పరిమితులు, పత్రాలు వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. దరఖాస్తు కోసం రూ.100 ఫీజు, రూ.10 వేల డిపాజిట్ చెల్లించడం వరకు సాధ్యమైనా, చివరికి లక్షల రూపాయలు చెల్లించాల్సిన దశలో చాలా మంది వెనక్కి తగ్గే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఈసారి ఓటర్లు మారారా?**

గతంతో పోలిస్తే గ్రేటర్ ఓటర్ల ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో దరఖాస్తులు స్వీకరించడం, సర్వేలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆశలు పెంచడం ఎన్నికల్లో ప్రభావం చూపేది. కానీ ఇప్పుడు ప్రజలు 'దరఖాస్తు కాదు.. ఇల్లు కావాలి' అనే స్థాయికి చేరుకున్నారు. బీఆర్ఎస్ హయాంలో దరఖాస్తులు చేసుకున్నా ఏళ్ల తరబడి ఇళ్లు రాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. అదే పరిస్థితి కాంగ్రెస్ హయాంలో కూడా పునరావృతమైతే రాజకీయంగా ప్రతికూల ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఇళ్ల తాళాలు ఇస్తేనే ఓట్లు?**

తెలంగాణ రాజకీయాల్లో సొంతింటి కల ఎప్పుడూ ఎన్నికల ప్రధాన అస్త్రంగానే ఉంది. అయితే ఈసారి పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ప్రజలు కేవలం ప్రకటనలు, దరఖాస్తులతో సంతృప్తి చెందే పరిస్థితి కనిపించడం లేదు. ప్రకటించిన లక్ష ఇందిరమ్మ ఇళ్లలో ఎంత వేగంగా నిర్మాణాలు పూర్తవుతాయి? అర్హుల ఎంపిక ఎంత పారదర్శకంగా ఉంటుంది? ఇప్పటికే నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రభుత్వం ఏమి చేస్తుంది? వంటి ప్రశ్నలకు సమాధానాలు రాబోయే రోజుల్లోనే తేలనున్నాయి. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయావకాశాలు ఇందిరమ్మ ఇళ్ల హామీని ఎంత వేగంగా ఆచరణలోకి తీసుకువస్తుందనే అంశంపైనే ఎక్కువగా ఆధారపడనున్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎన్నికల వరకు ఈ హౌసింగ్ రాజకీయమే గ్రేటర్‌లో ప్రధాన చర్చగా కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పేపర్ లీకులకు ఇక చెక్



(మొదటి పేజీ తరువాయి)

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అక్రమార్కుల ఆటకట్టించేలా చట్టపరమైన నిబంధనలను నిరంతరం నవీకరిస్తున్నామని సభకు తెలిపారు. చట్టంలో తెచ్చిన ఈ సవరణలు అభ్యర్థులకు, నిరుద్యోగ యువతకు ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. అధికారిక గణాంకాలను సభకు వివరించిన మంత్రి జితేంద్ర సింగ్, 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని వెల్లడించారు. అంతేకాకుండా, పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు కారణంగా మనస్తాపానికి గురై విద్యార్థులు చేసుకునే ఆత్మహత్యల శాతంలో ఇటీవలి కాలంలో గణనీయమైన తగ్గుదల కనిపించిందని, ఇది ఈ చట్టం తీసుకొచ్చిన సానుకూల ప్రభావానికి అద్దం పడుతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో లీకేజీలకు పాల్పడే వ్యవస్థలపై, ఏజెన్సీలపై మరింత కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కీలక బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన కాల్పుల ఘటనకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యులంటూ కాంగ్రెస్ అగ్రనేత, పక్ష నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు సభను తీవ్రంగా కుదిపివేశాయి. ప్రతిపక్ష సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు దూసుకొచ్చి తీవ్ర నిరసనలు, నినాదాలు చేపట్టడంతో సభలో విపరీతమైన గందరగోళం ఏర్పడింది. ప్రతిపక్షాల ఆందోళనల నడుమనే కేంద్రం బిల్లును సభ ఆమోదం పొందేలా ముందుకు తీసుకెళ్లింది. ప్రజా పరీక్షల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేసే ఈ చట్ట సవరణ బిల్లు ఆమోదం పొందిన వెంటనే, ప్రతిపక్షాల నిరసనల ఉధృతి తీవ్రం కావడంతో స్పీకర్ లోక్‌సభను గురువారానికి వాయిదా వేశారు. దేశంలోని లక్షల మంది విద్యార్థుల, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకునే పేపర్ లీక్ ముఠాలకు నూతన పబ్లిక్ ఎగ్జామినేషన్ సవరణ చట్టం–202 ద్వారా సింహస్వప్నంగా మారనుందని ప్రభుత్వ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.

# తూర్పు కనుమల్లో కొత్త వృక్ష జాతి

**నామకరణం చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**ముద్ర అమరావతి:** తిరుపతి జిల్లా పరిధిలోని తూర్పు కనుమల్లో కొత్తగా గుర్తించిన అరుదైన వృక్ష జాతికి చెందిన మొక్కకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నామకరణం చేశారు. యుఫోర్బియేసీ కుటుంబానికి చెందిన ఈ కొత్త జాతికి "క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్" అని పేరు పెట్టారు. ఉబ్బలమడుగు జలపాతానికి సమీపంలోని కంబకం కొండల ప్రాంతం ఈ మొక్కకు సహజ ఆవాసంగా ఉండటంతో, ఆ ప్రాంత పర్యావరణ ప్రాధాన్యాన్ని ప్రతిబింబించేలా ఈ పేరును ఖరారు చేశారు. అద్భుతమైన సుగంధ పరిమళాలను వెదజల్లే ఆకులు కలిగిన ఈ మొక్క ప్రత్యేకతలు పవన్ కళ్యాణ్‌ని ఆకట్టుకున్నాయి. ప్రధాన అటవీ సంరక్షణాధికారి పి.వి. చలపతిరావు తన పరిశోధనా సహచరులతో కలిసి తూర్పు కనుమల్లో నిర్వహించిన విస్తృత వృక్షశాస్త్ర పరిశోధనల సందర్భంగా ఈ కొత్త జాతి మొక్కను గుర్తించారు.



శాస్త్రీయ పరిశీలనల్లో, సమీప సంబంధిత జాతి అయిన క్రోటన్ అరోమాటికస్ తో పోలిస్తే ఈ మొక్క ప్రత్యేకమైన నిర్మాణం, పునరుత్పత్తి లక్షణాలను కలిగి ఉన్నట్లు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ తూర్పు కనుమల అపార జీవ వైవిధ్య సంపదను ప్రతిబింబించడమే కాకుండా, ఆ ప్రాంతంలో మరింత లోతైన శాస్త్రీయ పరిశోధనల ఆవశ్యకతను చాటింది. అత్యంత పరిమిత ప్రాంతంలో మాత్రమే కనిపించడం, సహజ ఆవాసాలపై పెరుగుతున్న ముప్పు క్రోటన్ ఉబ్బలమడుగెన్సిస్ జాతిని అంతరించిపోయే ప్రమాదంలో ఉన్న జాతిగా పరిశోధకులు గుర్తించారు. ఈ శాస్త్రీయ ఆవిష్కరణలు జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణ, రాష్ట్ర సహజ వారసత్వ సంపద సంరక్షణ పట్ల కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.

# రాహుల్ వర్సెస్ బీజేపీ

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల ఆందోళనలు, విద్యా వ్యవస్థ, ఆర్ఎస్ఎస్, కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన వ్యాఖ్యలకు అధికార పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా, సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. విద్యార్థుల ఆందోళనలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. పేపర్ లీక్‌ల కారణంగా యువత తీవ్ర నిరాశకు గురై నిరసనలకు దిగిందని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు కఠినంగా వ్యవహరించారని విమర్శించారు. తాను ఆందోళనకారులతో మాట్లాడినప్పుడు ప్రభుత్వం తమ బాధలను వినడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు.

'విద్యా వ్యవస్థను నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్'

ప్రస్తుతం విద్య ఖరీదైన వ్యవస్థగా మారిందని, తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నా విద్యార్థులకు న్యాయం జరగడం లేదని రాహుల్ అన్నారు. విద్యా వ్యవస్థపై ఆర్ఎస్ఎస్ ప్రభావం పెరిగిందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కేవలం ప్రతీక మాత్రమేనని ఆరోపించారు. విశ్వవిద్యాలయాల్లో కూడా ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారినే వైస్ చాన్సలర్లుగా నియమిస్తున్నారని పేర్కొన్నారు.

అమిత్ షాపై ఆరోపణలు

విద్యార్థుల నిరసనలను అణచివేసేందుకు పోలీసులు పెల్లెట్ గన్స్ ఉపయోగించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ చర్యలు కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకే జరిగాయని పేర్కొంటూ, దీనిపై ఆయన సభకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి సభకు రావడానికి ధైర్యం చేయడం లేదని కూడా విమర్శించారు.

భాజపా తీవ్ర అభ్యంతరం

రాహుల్ వ్యాఖ్యలపై భాజపా సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేంద్ర హోంమంత్రిపై ఆరోపణలు చేయడం తగదని మండిపడ్డారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలను స్పీకర్ సభా రికార్డుల నుంచి తొలగించారు. దీంతో యాంటీ పేపర్ లీక్ బిల్లుపై చర్చ కంటే రాహుల్ వ్యాఖ్యలే లోక్‌సభలో ప్రధాన చర్చనీయాంశంగా మారాయి.

# తెలంగాణ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్



**ముద్ర డెస్క్:** తెలంగాణలోని ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి సుప్రీంకోర్టు తెరదించింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మ సాగర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు, గౌరవెల్లి ప్రాజెక్టుల పర్యావరణ అనుమతుల చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్లను విచారించిన దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులు పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేయడంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కీలక ప్రాజెక్టులకు చట్టపరమైన రక్షణ లభించింది. దీంతో నిర్మాణ పనులకు ఉన్న న్యాయపరమైన అడ్డంకులు తొలగి, ప్రాజెక్టుల పనులు వేగం పుంజుకునే అవకాశం ఏర్పడింది.

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం 2021లో కేంద్ర పర్యావరణ శాఖ జారీ చేసిన కార్యనిర్వాహక మెమోరాండంను రద్దు చేసింది. అయితే, ఆ మెమోరాండం ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టంచేసింది. ఈ నిర్ణయంతో నిర్మాణ దశలో ఉన్న పాలమూరు–రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి వంటి ప్రాజెక్టులపై ఉన్న అనిశ్చితి తొలగిపోయింది. ఇన్నాళ్లుగా న్యాయపరమైన వివాదాల కారణంగా మందగించిన పనులు ఇకపై వేగవంతం కానున్నాయి.

**భవిష్యత్ ప్రాజెక్టులకు నిబంధనలు**

తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కేవలం కార్యనిర్వాహక ఉత్తర్వులు లేదా ఆఫీస్ మెమోరాండమ్‌లతో చట్టాలను సవరించడం లేదా భర్తీ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. భవిష్యత్తులో ముందస్తు పర్యావరణ అనుమతులు లేకుండా చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ఎలాంటి మినహాయింపులు ఇవ్వలేమని తేల్చిచెప్పింది. ఈ తీర్పు గతంలో అనుమతులు పొందిన ప్రాజెక్టులను రక్షిస్తూనే, భవిష్యత్ ప్రాజెక్టులకు పర్యావరణ చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పింది.

**తెలంగాణకు భారీ ఊరట**

సుప్రీంకోర్టు తీర్పుతో తెలంగాణలో సాగునీటి రంగానికి భారీ ఊరట లభించింది. ముఖ్యంగా మహబూబ్‌నగర్, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట జిల్లాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేలాది ఎకరాలకు సాగునీరు, కోట్లాది మందికి తాగునీరు అందించే ఈ ప్రాజెక్టులు వేగంగా పూర్తయ్యే అవకాశాలు మెరుగుపడ్డాయి. నిధుల సమీకరణను వేగవంతం చేసి నిర్మాణాలను పూర్తి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. తెలంగాణ సాగునీటి చరిత్రలో ఈ తీర్పు కీలక మలుపుగా నిలవనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# యువతిపై లైంగికదాడి

**ముద్ర, న్యూఢిల్లీ:** ఉత్తరాఖండ్‌లోని రుద్రపూర్‌లో 19 ఏళ్ల యువతిపై జరిగిన సామూహిక అత్యాచారం ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ దారుణానికి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసిన అనంతరం, నేరస్థల పునఃసృష్టి (సీన్ రీకన్‌స్ట్రక్షన్) కోసం తీసుకెళ్లిన సమయంలో జరిగిన పరిణామాలు ఉద్రిక్తతకు దారితీశాయి. నిందితులు పోలీసుల అదుపు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించగా, పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న స్థానికులు, పలు హిందూ సంఘాల కార్యకర్తలు ఆగ్రహంతో నిందితులపై దాడి చేసి చితకబాదారు.

పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 25న రుద్రపూర్‌కు చెందిన 19 ఏళ్ల యువతిని ముగ్గురు యువకులు అపహరించి, అనంతరం ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితులను పట్టుకునేందుకు వెళ్లిన సమయంలో వారు పోలీసులపై ఎదురుకాల్పులకు దిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఒక నిందితుడి కాలికి బుల్లెట్ తగలగా, అనంతరం ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టు అనంతరం దర్యాప్తులో భాగంగా నిందితులను నేరం జరిగిన ప్రాంతానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిర్వహించారు. ఈ సమయంలో ఇద్దరు నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. అయితే అక్కడే ఉన్న పోలీసులు వెంటనే వారిని పట్టుకున్నారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న స్థానిక ప్రజలు, పలు హిందూ సంఘాల కార్యకర్తలు తీవ్ర ఆగ్రహంతో నిందితులపై దాడి చేశారు. పోలీసులు వారిని అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

చివరికి పోలీసులు నిందితులను సురక్షితంగా తమ వాహనాల్లోకి ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. ఘటన నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బాధితురాలికి వైద్య చికిత్స అందించడంతో పాటు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మహిళలపై జరుగుతున్న నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# భారత్‌కు అమెరికా షాక్..

**ముద్ర డెస్క్ :** అమెరికాకు భారత్ నమ్మదగిన మిత్ర దేశం.. మోదీ నాకు ప్రియ మిత్రుడు అంటూనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై కుట్రలు చేస్తు న్నాడు. తేనె పూసిన కత్తిలా వ్యవహరిస్తున్నాడు. పైకి తియ్యగా మాట్లాడుతూ అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసేలా వ్యూహాలు రూపొందిస్తున్నాడు.

తాజాగా అమెరికా సెనేట్ రష్యాపై కొత్త ఆంక్షల బి ల్లును ముందుకు తీసుకెళ్లడంతో భారత్ కు మరో పెద్ద సవాల్‌గా మారింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై 100 శాతం టారిఫ్‌లు విధించే అవకాశం ఏర్పడింది. ఇది కేవలం వాణి జ్య చర్య మాత్రమే కాదు.. ఇంధన భద్రత, ద్రవ్యోల్బణం, విదేశీ వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**బిల్లు ఉద్దేశం, లక్ష్యాలు..**

ఉక్రెయిన్‌తో యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో రష్యా ఆదాయాన్ని తగ్గించాలనే లక్ష్యంతో అమెరికా ఈ చర్యలు తీసుకుంటోంది. రష్యా చమురు, వాయువు కొనుగోలు చేసే ప్రధాన దేశాలపై భారీ టారిఫ్‌లు విధించడం ద్వారా మాస్కోపై ఒత్తిడి పెంచాలని వాషింగ్టన్ భావిస్తోంది. భారత్‌తోపాటు మరికొన్ని దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇది నేరుగా రష్యాపై కాకుండా, దాని ప్రధాన కస్టమర్ల ద్వారా పరోక్షంగా ఆంక్షలు విధించే వ్యూహం.

**భారత్ ఎందుకు టార్గెట్..**

ప్రస్తుతం భారత్ రష్యా చమురుపై గణనీయంగా ఆధారపడుతోంది. మధ్యప్రాచ్యంలోని హార్ముజ్ జలసంధి మార్గంలో ఇంధన రవాణా కష్టతరం కావడంతో ప్రత్యామ్నాయ వనరుల అవసరం పెరిగింది. రష్యా నుంచి తగ్గింపు ధరలకు లభిస్తున్న చమురు భారత్‌కు ఆర్థికంగా లాభదాయకంగా మారింది. అయితే ఈ ఆధారపడటమే ఇప్పుడు అమెరికా టారిఫ్ ముప్పుకు కారణమవుతోంది. 100 శా తం టారిఫ్‌లు అమల్లోకి వస్తే భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై భారీ సుంకాలు పడే అవకాశం ఉంది.

**ఇంధన భద్రతపై ప్రభావం**

హార్ముజ్ మార్గంలో అంతరాయాలు ఏ ర్పడిన తరుణంలో రష్యా చమురు భారత్‌కు కీలకంగా మారింది. ఒకవేళ టారిఫ్‌ల ఒత్తిడితో రష్యా నుంచి కొనుగోళ్లు తగ్గించాల్సి వస్తే, ప్రత్యామ్నాయ వనరుల కోసం ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తుంది. దీనివల్ల దేశీయ పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే ప్రమాదం ఉంది. తద్వారా ద్రవ్యోల్బణం పెరగడం, పరిశ్రమల ఉత్పత్తి ఖర్చులు పెరగడం వంటి దుష్పరిణామాలు ఉంటాయి. అమెరికా ఈ చర్యను రష్యాను ఇరుకున పెట్టేం దుకు తీసుకుంటున్నట్లు చెబుతున్నా, భారత్ వంటి వ్యూహాత్మక భాగస్వాములపై ప్రభావం పడటం ద్వైపాక్షిక సంబంధాల్లో ఉద్రిక్తతకు దారితీయవచ్చు. భారత్ ఇప్పటికే బహుముఖ విదేశాంగ విధానం అనుసరిస్తూ వివిధ దేశాల నుంచి ఇంధనం సేకరిస్తోంది. టారిఫ్ ముప్పు నేపథ్యంలో మరిన్ని ప్రత్యామ్నాయ మార్గాలు, దీర్ఘకాలిక సరఫరా ఒప్పందాలు, దేశీయ ఉత్పత్తి పెంపు వంటి చర్యలపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# జలవిలయం

(మొదటి పేజీ తరువాయి)

సహాయక చర్యలను ముమ్మరం చేశారు. అస్సాంలో వారం రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా బ్రహ్మపుత్రతో పాటు పలు నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ఆరు జిల్లాల్లో వరదలు ఉధృతమై 631 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సుమారు 6.54 లక్షల మంది ప్రజలు వరద ప్రభావంతో ఇబ్బందులు పడుతుండగా, వరదలకు సంబంధించిన వివిధ ఘటనల్లో ఇప్పటివరకు 71 మంది ప్రాణాలు కోల్పోయారు. వేల ఎకరాల్లో పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నప్పటికీ పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉంది.

ఇక తెలంగాణలో మహారాష్ట్ర ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. కాళేశ్వరం సంగమం వద్ద నీటిమట్టం 5.070 మీటర్లకు చేరగా, మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి భారీగా వరద నీరు చేరుతోంది. బ్యారేజీకి 54,820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవడంతో అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి నేపథ్యంలో బ్యారేజీలోని మొత్తం 85 గేట్లను పూర్తిగా ఎత్తివేయడంతో గోదావరి ఉరకలెత్తుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున రానున్న గంటల్లో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు హెచ్చరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 30.07.2026
www.mudranews.in | @mudranews



టీని 30 రోజులు మానేస్తే.. గ్యాస్, అసిడిటీకి ఉపశమనం

పరగడుపున టీ తాగే అలవాటు వల్ల వచ్చే కడుపు మంట, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు తగ్గి జీర్ణక్రియ మెరుగుపడుతుంది.



# చెంగిచెర్ల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సామర్థ్యం పెంపు..

### 25 వేల సర్వీసులకు ప్రయోజనం

**ముద్ర, హైదరాబాద్:** వినియోగదారులకు మరింత నాణ్యమైన, స్థిరమైన విద్యుత్ సరఫరా అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ కీలక చర్యలు చేపట్టింది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మేడ్చల్ జోన్ పరిధిలోని 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌స్టేషన్లో ఉన్న 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 12.5 ఎంవీఏ సామర్థ్యంతో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి బుధవారం విజయవంతంగా చార్జింగ్ చేశారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా ఈ అప్‌గ్రేడేషన్ చేపట్టినట్లు టీజీఎస్పీడీసీఎల్ అధికారులు తెలిపారు.

ఈ సామర్థ్య పెంపుతో చెంగిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని సుమారు 25 వేల విద్యుత్ సర్వీసులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందనుంది. ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ తగ్గడంతో పాటు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా నిర్వహించడం, ఓవర్‌లోడింగ్‌ను నివారించడం, వోల్టేజ్ స్థాయిలను మెరుగుపరచడం ద్వారా వినియోగదారులకు నిరంతరాయ, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందే అవకాశం ఉంది.

ఈ అప్‌గ్రేడేషన్ వల్ల చెంగిచెర్ల గ్రామం, క్రాంతి కాలనీ ఫేజ్-1 నుంచి 5, ఎంఎల్ఆర్ కాలనీ, అక్షయ నగర్, వెంకటసాయి నగర్, ప్రివిలేజ్, సాయి రెసిడెన్సీ, వెంకటాద్రి నగర్, కృష్ణానగర్, నందిని నగర్, దత్తాత్రేయ నగర్, రాజేష్ నగర్, ద్వారకా నగర్, రాధికా నగర్, స్టాలిన్ కాలనీ, టీఎస్ ఫుడ్స్ కాలనీ, శివగణేష్ నగర్, యాదయ్య నగర్, కాకతీయ కాలనీ, కమలానగర్, జయశ్రీ కాలనీ, అరవింద్ ఎన్‌క్లేవ్, అక్షయ ఎన్‌క్లేవ్, బుద్ధ విహార్, రామకృష్ణ నగర్, మై విల్లాస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడనుంది.

ఈ కార్యక్రమంలో టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్. నర్సింహులు, చీఫ్ ఇంజనీర్ (మేడ్చల్ జోన్) పీ.వి. రమేష్, సూపరింటెండింగ్ ఇంజనీర్ పీ. వెంకన్నతో పాటు పలువురు ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడం, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అప్‌గ్రేడ్ చేయడం, పంపిణీ వ్యవస్థను ఆధునీకరించడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారులకు నాణ్యమైన, విశ్వసనీయ, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ చర్యలను మరింత వేగవంతం చేస్తోంది.

## ఐఐటీ ఖరగ్‌పూర్‌లో హైదరాబాద్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి



**ముద్ర, ఢిల్లీ :** ఐఐటీ ఖరగ్‌పూర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. హైదరాబాద్‌కు చెందిన పుల్లగురం దీపక్‌రెడ్డి (36) బుధవారం మధ్యాహ్న సమయంలో క్యాంపస్‌లోని స్టాఫ్ క్వార్టర్స్‌లో ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు. సమాచారం అందుకున్న హిజ్లీ ఔట్‌పోస్టు పోలీసులు వెంటనే క్యాంపస్‌లోని బీసీ రాయ్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ విషయాన్ని దీపక్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చేరవేసినట్లు పోలీసులు తెలిపారు. ఆయన గదిని పోలీసులు సీల్ చేసి దర్యాప్తు చేపట్టారు.

# భవ్య పథకంలో 4 ఇండస్ట్రియల్ పార్కులు..

**- కేంద్రానికి రాష్ట్ర ప్రతిపాదనలు**



**ముద్ర , హైదరాబాద్ :** భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకంలో భాగంగా రాష్ట్రంలో 4 ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ భవ్య పథకంలో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఇండస్ట్రియల్ పార్క్ ల పురోగతిపై బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సిఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పరిశ్రమలు వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చేనేత, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సిక్తా పట్నాయక్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, భవ్య పథకంలో మొదటి దశలో భాగంగా రాష్ట్రంలో ఏర్పాటు చేసే 4 ఇండస్ట్రియల్ పార్కులకు సంబందించిన పూర్తి ప్రాజెక్ట్ రిపోర్ట్ ను కేంద్రానికి ఈనెలాఖరులోగా అందచేస్తున్నామని తెలిపారు. ఒక్కో పార్కు 500 ఎకరాలకన్నా అధిక విస్తీర్ణంలో ఉంటుందని, ఇందుకుగాను భూసేకరణ ఇతర ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని తెలిపారు. వీటిలో కందుకూరు మండలం తిమ్మాపూర్, ఇబ్రహీం పట్నం ఎలిమినేడు, ఘట్కేసర్ మండలం మాదారం, చౌటుప్పల్ మండలం దండు మైలారం ఉన్నాయన్నారు. వీటిలో ఎలక్ట్రానిక్, సాఫ్ట్ వేర్ తదితర రంగాలకు చెందిన పరిశ్రమల ఏర్పాటుకు పలు ప్రముఖ కంపెనీలు ముందుకు వచ్చాయని అన్నారు. వీటితోపాటు, మరో 16 ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నామని ఆయన వివరించారు.

# బీఆర్ఎస్ నేతలది దౌర్భాగ్యం..



**- నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి పంపింగ్ తమ వల్లేనని చెప్పుకోవడం విడ్డూరం**
**- రైతుల ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**
**- అందులో భాగంగానే నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి నీటి విడుదల**
**- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**

**ముద్ర, కరీంనగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌లను ప్రారంభించి రైతుల కోసం నీటిని ఎత్తిపోస్తుంటే అది తమ వల్లేనని చెప్పుకోవడం బీఆర్ఎస్ నేతల దౌర్భాగ్యానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు విమర్శించారు.

బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్ లలోని బాహుబలి మోటార్లను ప్రారంభించి 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా, సాగునీటి అవసరాలు తీరేలా ప్రభుత్వం బాధ్యతాయుతంగా చర్యలు చేపడుతుంటే, దానిని తమ పోరాట ఫలితమని బీఆర్ఎస్ ప్రచారం చేయడం రాజకీయ అవకాశవాదానికి పరాకాష్ట అన్నారు.

పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో ప్రచారానికే పరిమితమైన బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం తీసుకుంటున్న ప్రతి నిర్ణయానికీ క్రెడిట్ తీసుకోవాలని ప్రయత్నించడం హాస్యాస్పదమన్నారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రజలు వాస్తవాలను గుర్తించే స్థితిలో ఉన్నారని చెప్పారు.

రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తోందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమైతే, ప్రతి అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం బీఆర్ఎస్ నైజంగా మారిందన్నారు.

ప్రజల మెప్పు కోసం ఎన్ని విన్యాసాలు చేసినా, ఎన్ని దుష్ప్రచారాలు చేసినా బీఆర్ఎస్‌ను మళ్లీ నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరని, రైతుల సంక్షేమం, సాగునీటి నిర్వహణ, వ్యవసాయాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన అజెండా అని వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు.

# ఏపీలో ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల తయారీకి తైవాన్ కంపెనీల ఆసక్తి

### సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ లతో తైవాన్ ప్రతినిధి బృందం భేటీ




**ముద్ర, అమరావతి :** ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు సహా అధునాత తయారీ, సాంకేతిక రంగాల్లో ఏపీతో భాగస్వామ్యాన్ని మరింత పెంచుకునే దిశగా తైవాన్ పారిశ్రామిక ప్రతినిధుల బృందం సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యింది. తైవాన్ కంపెనీలు, పరిశ్రమలకు చెందిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో వివిధ అంశాలపై చర్చలు జరిపింది. తైవాన్ కు చెందిన డెల్టా ఎలక్ట్రానిక్స్, బెన్ క్యూ, సీబీటీసీ బ్యాంక్, డైమెర్కో, మాస్టర్ హిల్, నాన్ పావ్ రెసిన్స్, ఎవర్ క్లియర్ ఎన్విరానమెంటల్ ఇంజనీరింగ్, షెంగ్ హుయ్ టెక్, టెక్ టాప్ ఇంజనీరింగ్, కేఎస్ టెర్మినల్స్, శాండ్ సన్, జిలీ కనస్ట్రక్షన్స్ అండ్ ఇంజనీరింగ్, కపెల్లా స్టోర్స్ వంటి అంతర్జాతీయ స్థాయి దిగ్గజ సంస్థల కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైలు, రోడ్డు మార్గాల వంటి పటిష్టమైన లాజిస్టిక్స్ నెట్వర్క్ సహా ఏపీలోని తయారీ రంగ ఎకోసిస్టమ్ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు తైవాన్ ప్రతినిధుల బృందానికి వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమికండక్టర్లు, ఐటీ, అడ్వాన్స్డ్ మాన్యుఫాక్చరింగ్ సహా ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు విధానపరమైన స్థిరత్వం, వేగంగా అనుమతులు జారీ చేయటంతో పాటు పూర్తి స్థాయి ప్రోత్సాహాన్ని అందించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. భారత్ లో తమ దేశానికి చెందిన సంస్థలు ఇప్పటికే తయారీ రంగంలో కీలకంగా ఉన్నాయని తైవాన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏపీలో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. తయారీ రంగం, సాంకేతికత, పారిశ్రామికాభివృద్ధిలో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చర్చల సందర్భంగా ఏకగ్రీవంగా అంగీకారం కుదిరింది.

### ఐటీ మంత్రితో తైవాన్ బృందం చర్చలు

అనంతరం ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ తో తైవాన్ ప్రతినిధుల బృందం ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఏపీలో మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల కల్పన విద్యాపరమైన సహకారంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. తైవాన్‌కు చెందిన మాన్యుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ రంగాలలోని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా ఏపీకి చెందిన యువతకు తగిన నైపుణ్యం, టెక్నికల్ ట్రైనింగ్ సహా ఉన్నత విద్య భాగస్వామ్యాలపై తైవాన్ ప్రతినిధుల బృందంతో చర్చలు జరిగాయి.

ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ల తయారీ, ప్రిసిషన్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, హెల్త్‌కేర్, ఇతర హై-స్కిల్ రంగాలలో పరస్పర సహకారం అందించుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ప్రపంచ స్థాయి నైపుణ్య గ్రిడ్‌ను నిర్మించడంతో పాటు మాండరిన్ భాషలో శిక్షణ, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సర్టిఫికేషన్, ఇంటర్న్‌షిప్‌లు, విద్యార్థి-ఫ్యాకల్టీ మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, ఉద్యోగ-సన్నద్ధత కార్యక్రమాలపై కూడా చర్చలు జరిగాయి. తైవాన్- ఏపీ మధ్య ఈ సమావేశం కీలక మైలు రాయిగా నిలవనుంది.

## కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ

**- అంతర్రాష్ట్ర జలాలపై కీలక చర్చలు**



**ముద్ర, న్యూఢిల్లీ:** ఢిల్లీలోని కర్ణాటక భవన్ లో కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్తో తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు సంబంధించిన అంతర్రాష్ట్ర నదీ జలాల అంశాలపై ఇరు రాష్ట్రాల నేతలు విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా తుంగభద్ర, కృష్ణా నదీ జలాల వినియోగం, పంపిణీ, జల వివాదాలకు సంబంధించిన అంశాలు సమావేశంలో ప్రధాన చర్చాంశాలుగా నిలిచాయి. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరస్పర సహకారంతో జల వనరుల వినియోగం, భవిష్యత్ కార్యాచరణపై అభిప్రాయాలను పంచుకున్నట్లు సమాచారం. అంతర్రాష్ట్ర జలాల అంశంలో సమన్వయంతో ముందుకు సాగేందుకు ఈ సమావేశం కీలకంగా మారినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## ఆప్మెల్‌లో 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ప్రారంభం




**ముద్ర న్యూస్ :** సింగరేణి అనుబంధ సంస్థ ఆప్మెల్ (విజయవాడ)లో రూ.1.24 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాశ్ జ్యోతి బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌లో నిర్మించిన సీసీ, ఆర్‌సీసీ రోడ్లను కూడా ప్రారంభించారు.

సోలార్ ప్లాంట్ ద్వారా సంస్థకు ఏటా సుమారు రూ.24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా అవుతుందని, ఐదేళ్లలో పెట్టుబడి తిరిగి వస్తుందని అధికారులు తెలిపారు. అలాగే ఆప్మెల్ 50 ఏళ్ల చరిత్రలోనే తొలిసారిగా రూ.63.13 కోట్ల టర్నోవర్, రూ.23.33 కోట్ల నికర లాభం నమోదు చేయడం పట్ల సీఎండీ ఉద్యోగులను అభినందించారు. స్వర్ణోత్సవ సంవత్సరంలో వ్యాపార విస్తరణపై దృష్టి సారించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం. తిరుమలరావు, ఈడీ (కోల్ మూవ్‌మెంట్) బి. వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ పాల్గొన్నారు. విజయవాడలోని ఆప్మెల్ నుంచి ఎండీ ఎర్రన్నతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తెలంగాణలో భారీగా పోలీసు ఉద్యోగాల భర్తీ..

**7,437 పోస్టులకు నోటిఫికేషన్లు**

**ముద్ర, హైదరాబాద్ :** తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక (tgprb) మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ఫైర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ ఫైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది.

## ప్రధానమంత్రి అపాయింట్‌మెంట్ కోరిన మంత్రి తుమ్మల

**ముద్ర, హైదరాబాద్:** ఆయిల్‌పామ్ రైతుల సమస్యలు, విధానపరమైన అంశాలపై చర్చించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపాయింట్‌మెంట్ ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ప్రధాని, కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖలు రాశారు. కనీస హామీ ధర (MGP), దిగుమతి సుంకాల విధానం, నాణ్యమైన మొలకల లభ్యత, NMEO-OP కింద ఆర్థిక సహాయాలపై నిర్ణయాలు అవసరమని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులతో కలిసి ప్రధానమంత్రిని కలిసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

## బిఎల్‌ఓ,బిఎల్‌ఏ లతో సమావేశం



**ముద్ర, కోరుట్ల;** కోరుట్ల నియోజక వర్గ స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులకు మీటింగ్ తీసుకొని (ప్రత్యేక సమగ్ర సవరణ) ఎస్ఐఆర్ ప్రక్రియ లో భాగంగా బిఎల్ఓ మరియు బిఎల్ఏ లతో మీటింగ్ నిర్వహించి సంబంధిత పోలింగ్ స్టేషన్ లలో మరణించిన వారు, డబుల్ ఓటర్లు మరియు వలస వెళ్ళిన వారిని గుర్తించి మిగిలిపోయిన ఓటర్ల ను ఎన్యూమరేషన్ ఫామ్ డిజిటలైజేషన్ చేసి 100 శాతం పూర్తి చేయగలరని సమావేశం నిర్వహించుకోవడం జరిగింది. ఇట్టి సమావేశం లో ఆర్డీవో & ఓటర్ నమోద్ అధికారి ఎల్. జీవాకర్ రెడ్డి, నియోజక వర్గం లోని కోరుట్ల, మెట్పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం ఎమ్మార్వోలు సి హెచ్. కృష్ణ చైతన్య, ఎన్. నీతా, రాంచందర్, ప్రసాద్ నాయబ్, ఏం. డి ఫారుఖ్ మరియు రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
గురువారం 30.07.2026



మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

ప్రజాస్వామ్యంలో పదవులు

# తాత్కాలికం

## ప్రజా సేవే శాశ్వతం

కాలం మారింది.. రాజకీయాలు మారినా.. ప్రజాస్వామ్య విలువలు మారద్దు

ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికల వ్యవస్థ కాదు. అది ప్రజల ఆశలు, ఆకాంక్షలు, విశ్వాసాలు, భవి ష్యత్తు కలిసిన ఒక గొప్ప బాధ్యత. ప్రతి ఐదు సంవత్సరాలకు ప్రజలు తమ ఓటుతో అధికారాన్ని అప్పగిస్తారు. ఆ అధికారం శాశ్వతం కాదని, అది ప్రజలు ఇచ్చిన తాత్కా లిక బాధ్యత మాత్రమేనని ప్రతి ప్రజాప్రతినిధి గుర్తుంచుకోవాలి.

నేను నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిజంలో కొనసాగుతున్న ఒక సీనియర్ జర్నలిస్టును. ఎన్నో ఎన్నికలను చూశాను. ఎన్నో ప్రభుత్వాలను చూశాను. అధికారంలోకి వచ్చిన నాయకులను చూశాను. అదే ప్రజల తీర్పుతో అధికారాన్ని కోల్పోయిన నాయకులనూ చూశాను. అలాగే సమాజం కోసం జీవితాన్ని అంకితం చేసి, పదవి లేకపోయినా ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించిన మహనీయులను కూడా చూశాను.

రాజకీయాల్లో కూడా నేను ప్రయాణిస్తున్నాను. అందువల్ల రాజకీయాల వాస్తవాలు నాకు తెలుసు. రాజకీయ నాయకుడిగా ఆలోచించే సందర్భాలు ఉంటాయి. కానీ నా అంతరంగంలో ముందుగా మేల్కొనేది ఒక జర్నలిస్టు. ఎందుకంటే జర్నలిస్టు కళ్లతో సమాజాన్ని చూసిన అనుభవం ఎప్పటికీ మాయమవదు.

దాదాపు 15 సంవత్సరాల క్రితం రాజకీయాల తీరు, ప్రచార విధానం, ప్రజలతో నాయకుల సంబంధం నేటితో పోలిస్తే భిన్నంగా ఉండేది. అప్పుడు ఒక నాయకుడి గురించి మాట్లాడితే ముందుగా ఆయన చేసిన పనులు గుర్తుకొచ్చేవి. ఏ గ్రామానికి తాగునీరు అందించారు? ఏ పాఠశాలను నిర్మించారు? ఏ చెరువును పునరుద్ధరించారు? ఎంతమంది పేదలకు అండగా నిలిచారు? ఇవే చర్చకు వచ్చేవి.

కానీ నేడు కాలం మారింది. సాంకేతికత పెరిగింది. సామాజిక మాధ్యమాలు ప్రతి ఒక్కరి చేతిలోకి వచ్చాయి. సమాచారం వేగంగా చేరుతోంది. ఇది అభివృద్ధికి సంకేతమే. అయితే అదే సమయంలో ఒక ఆందోళన కూడా పెరుగుతోంది.

నేడు చాలా సందర్భాల్లో పని కంటే ప్రచారానికి, సేవ కంటే వ్యక్తిగత ఇమేజ్‌కు, అభివృద్ధి కంటే ఆర్భాటానికి ఎక్కువ ప్రాధాన్యం లభిస్తున్నట్లు కనిపిస్తోంది. "ఆహా", "ఓహో", "టైగర్ సైన్యం", "సింహం", "లెజెండ్" వంటి పదాలు సామాజిక మాధ్యమాల్లో మారుమోగుతున్నాయి. ఇవి అభిమానాన్ని వ్యక్తం చేయడానికి ఉపయోగపడవచ్చు. కానీ అవే ప్రజాస్వామ్యానికి ప్రమాణాలుగా మారకూడదు.

ఎందుకంటే చరిత్ర పోస్టర్లను భద్రపరచదు. చరిత్ర హ్యాష్‌ట్యాగ్‌లను గుర్తుంచుకోదు. చరిత్రకు అవసరం ప్రజలకు ఉపయోగపడిన పనులు, సమాజానికి మేలు చేసిన నిర్ణయాలు, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచిన సేవలు మాత్రమే.

**ఒక జర్నలిస్టుగా నాకు కలిగే బాధ ఇదే.**

మనం ప్రజలకు చూపించాల్సింది నాయకుడి గొప్పతనాన్ని కాదు; నాయకుడు చేసిన గొప్ప పనులను. ప్రజలు వినాల్సింది ప్రశంసల నినాదాలు కాదు; అభివృద్ధి ఫలితాలు. ప్రజాస్వామ్యానికి అవసరమైంది వ్యక్తి ఆరాధన కాదు; బాధ్యతాయుతమైన నాయకత్వం.

నేను ఇది ఎవరినీ విమర్శించడానికి రాయడం లేదు. ఎవరినీ లక్ష్యంగా చేసుకోవడం లేదు. సమాజం పట్ల ఉన్న బాధ్యతతో, ప్రజాస్వామ్యం పట్ల ఉన్న గౌరవంతో, జర్నలిజం నేర్పిన విలువలతో ఈ ఆవేదనను వ్యక్తం చేస్తున్నాను.

ఎన్నికల్లో గెలవడం గొప్ప విషయం. కానీ ఐదు సంవత్సరాల తర్వాత ప్రజలు మీ పేరును గౌరవంగా గుర్తు చేసుకోవడం ఇంకా గొప్ప విషయం. అది పోస్టులతో కాదు. అది ప్రచారంతో కాదు. అది చేసిన పనులతో మాత్రమే సాధ్యం.

★ప్రజాప్రతినిధులు ఒకసారి తమను తాము ప్రశ్నించుకోవాలి.
★నా పదవీకాలం ముగిసిన తర్వాత ప్రజలు నన్ను ఏ పనితో గుర్తు పెట్టుకుంటారు?
★ఒక వంతెనా?
★ఒక పాఠశాలా?
★ఒక ఆసుపత్రియా?
★ఒక చెరువు పునరుద్ధరణా?
★ఒక పేదవాడి కన్నీరు తుడిచిన సంఘటనా?
★లేక కేవలం వేలాది సోషల్ మీడియా పోస్టులా?

ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం చెప్పగలిగితే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది.

రాజకీయాలు శత్రుత్వానికి కాదు; సమాజ నిర్మాణానికి వేదిక కావాలి. పదవులు అధికార ప్రదర్శనకు కాదు; ప్రజా సేవకు సాధనాలు కావాలి. ప్రచారం అవసరమే. కానీ అది పనిని ప్రతిబింబించాలి. పని లేకుండా ప్రచారం ఉంటే అది కొంతకాలం మాత్రమే నిలుస్తుంది. పని ఉంటే ప్రచారం లేకపోయినా ప్రజలే చరిత్ర రాస్తారు.

–నా జీవిత ప్రయాణం నాకు ఒక గొప్ప సత్యాన్ని నేర్పింది.

పదవులు మారిపోతాయి. జెండాలు మారిపోతాయి. ప్రభుత్వాలు మారిపోతాయి. కానీ ప్రజలకు చేసిన మంచి ఎప్పటికీ మారదు.

అందుకే ప్రజాప్రతినిధులకు విన్నపం

ప్రజాస్వామ్యాన్ని నినాదాలతో కాదు, నిజాయితీతో బలపరుద్దాం. వ్యక్తి ఆరాధన కంటే ప్రజా ప్రయోజనానికి ప్రాధాన్యం ఇద్దాం. సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు రాసే ముందు, సమాజంలో శాశ్వతంగా నిలిచే పనులు చేద్దాం.

అప్పుడు మాత్రమే రాబోయే తరాలు మన గురించి గర్వంగా చెప్పుకుంటాయి.

ఎందుకంటే...!

ప్రచారం కాలంతో కలిసి కనుమరుగవుతుంది. ప్రజలకు Shark సేవ కాలాన్ని దాటి చిరస్థాయిగా నిలుస్తుంది. అదే ప్రజాస్వామ్యం చెప్పే అసలైన పాఠం.



గొడుగు శ్రీనివాస్ ముదిరాజ్
సీనియర్ జర్నలిస్ట్



కళాకారులు స్కాట్ మరియు స్టువర్ట్ జెంట్లింగ్ రూపొందించిన ఈ అద్భుత చిత్రంలో అజ్టెక్ సామ్రాజ్య రాజధాని టెనోచ్టిట్లాన్ పునర్నిర్మించబడింది. 1325 CEలో టెక్స్కోకో సరస్సులోని ఒక ద్వీపంపై స్థాపించబడిన ఈ నగరం కాలువలు, దేవాలయాలు మరియు అద్భుతమైన ఇంజినీరింగ్‌తో ప్రపంచంలోని గొప్ప నగరాలలో ఒకటిగా పేరొందింది. 1521లో, స్పానిష్ ఆక్రమణదారులు ఈ నగరాన్ని ధ్వంసం చేశారు. తరువాత టెక్స్కోకో సరస్సును ఎండబెట్టి, అదే ప్రాంతంలో నేటి మెక్సికో సిటీ నిర్మించబడింది. ఇప్పటికీ ఈ మహా నాగరికత అవశేషాలు ఆధునిక నగరం కింద దాగి ఉన్నాయి.

# మధ్య తరగతికి సంక్షోభం

ఓ వైపు ఎల్‌నినో.. మరోవైపు యుద్ధం సామాన్యులను భయపెడుతున్నాయి. ఇప్పటికే యుద్ధం దెబ్బకు కుదేలైన మధ్య తరగతికి.. పులి మీట పుట్రలా ఎల్‌నినో వచ్చి పడింది. ఈ రెండింటి కారణంగా రూపాయి విలువ తగ్గుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. తద్వారా కొనుగోలు శక్తి తగ్గుతోంది. ఏతా వాతా మధ్యతరగతికి రాబోయేది గడ్డురోజులేననే సంకేతాలు కనిపిస్తున్నాయి. అప్రమత్తంగా లేకపోతే చిక్కులు తప్పని దుస్థితి. అందుబాటులో ఉన్న వనరుల్ని, చేతిలో ఉన్న డబ్బును చాలా జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉంది. ఇరాన్ యుద్ధం ఆగే ప్రసక్తే లేదని తేలిపోవడంతో.. నిరాశలో మునిగిన ప్రపంచానికి.. ఎల్‌నినో ప్రభావం ఏ మాత్రం మింగుడుపడటం లేదు. ఇప్పటికే మన దేశంలో ఎల్‌నినో ప్రభావంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. గతంలో ఎన్నో సంక్షోభాల నుంచి దేశాన్ని బయటపడేసిన వ్యవసాయ రంగమే.. ఇప్పుడు ఎల్‌నినోతో సంక్షోభంలోకి వెళ్లే దుస్థితి నెలకొనడంతో.. భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.



ఏ ముహూర్తాన కరోనా వచ్చిందో కానీ.. అప్పట్నుంచీ ప్రపంచం కష్టాల సుడిగుండంలో చిక్కుకుంది. కరోనా పూర్తిగా తగ్గుముఖం పట్టక ముందే.. ఉక్రెయిన్ యుద్ధం మొదలైంది. అది కొనసాగుతుండగానే ఇరాన్ యుద్ధం వచ్చి పడింది. ఈ యుద్ధం ఆగినట్టే ఆగి.. మళ్లీ తీవ్ర రూపం తీసుకుంటున్న తరుణంలో.. ఎల్‌నినోతో మిగిలి ఉన్న కాస్త ఆశలు కూడా ఆవిరయ్యే దుస్థితి వచ్చేసింది. ఓ వైపు యుద్ధం.. మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో మధ్య తరగతికి మరిన్ని కష్టాలు తప్పవని తేలిపోయింది. యుద్ధం కారణంగా ఇంధన, సరఫరా సమస్యలు వచ్చి.. ధరలు పెరిగి.. ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ఆర్థిక సంక్షోభం వచ్చేసింది. కాకపోతే ఆర్థిక సమస్యలు వచ్చినా.. వ్యవసాయం బాగుంటే ఏదోలా నెట్టుకురావచ్చనుకున్న సామాన్యుడి ఆశలపై ఎల్‌నినో నీళ్లు చల్లింది. ఇప్పుడు ఎల్‌నినో కారణంగా వర్షాభావంతో.. సాగువిస్తీర్ణం భారీగా తగ్గింది. కరోనా సమయం నుంచీ ఊహించని పంటల దిగుబడులతో.. ఇతర దేశాలను ఉదారంగా ఆదుకున్నాక కూడా.. మనకు తిండిగింజలకు కొరత రాలేదు. కానీ ఇప్పుడు ఎల్‌నినో ఆ పరిస్థితిని రివర్స్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. వ్యవసాయం కుదేలై.. పంటల దిగుబడులు తగ్గితే.. ఆహార సమస్య వచ్చి.. అది ఆహార ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. అప్పుడు అటు ఆర్థికంగా చితికిపోయి.. ఇటు ఆహారం కూడా దొరకని పరిస్థితుల్లో.. సామాన్యులు మరింతగా విలవిల్లాడటం ఖాయమనే అంచనాలు అందర్నీ భయపెడుతున్నాయి. సరే ఎక్కడ ఏ సంక్షోభం వచ్చినా సామాన్యుడే సమిధగా మారుతున్న వాస్తవం కూడా అందరికీ తెలిసిందే. కాబట్టే ఇప్పుడు ఒకదానిపై ఒకటిగా వచ్చిపడుతున్న సమస్యల ధాటికి.. దేశంలో మధ్యతరగతి ఏమైపోతుందోననే ఆందోళన కనిపిస్తోంది. ఎందుకంటే ఆర్థిక సంస్కరణల తర్వాత.. దేశ అభివృద్ధి రథాన్ని ముందు లాగుతోంది మధ్యతరగతే. ఇప్పుడు అలాంటి మధ్యతరగతి నడ్డివిరిగే పరిస్థితులు ఒకదానితర్వాత ఒకటిగా చాలా వేగంగా ఏర్పడుతుండటం.. దీర్ఘకాలిక సంక్షోభాలకు దారితీసే ప్రమాదం లేకపోలేదు.

వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న అన్నదాతలకు ముమ్మందు మరిన్ని కష్టాలు తప్పేలా లేవు. ఇప్పటికే ఖరీఫ్ సాగును ప్రశ్నార్థకం చేసిన ఎల్‌నినో, వచ్చే ఏడాది మార్చి దాకా ఉంటుందని, తద్వారా యాసంగి సాగునూ అది దెబ్బతీసే అవకాశాలున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఆగస్టులో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నా.. సెప్టెంబరులో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని, ఇది డిసెంబరు దాకా కొనసాగుతుందని వాతావరణ కేంలు చెప్పేస్తున్నాయి. జూన్‌లో మొదలైన ఎల్‌నినో ప్రభావం అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో తీవ్రంగా ఉండనుందని.. వచ్చే ఏడాది మార్చి దాకా కొనసాగుతుందని జాతీయ సముద్ర సమాచార సేవల కేంద్రం.. ఇన్‌కాయిస్ కూడా హెచ్చరించింది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల, వర్షపాతం తగ్గుతుందని విశ్లేషించారు. ఫలితంగా ఎల్‌నినో ప్రభావం కారణంగా అక్టోబరుతో ప్రారంభమై జనవరి దాకా సాగే యాసంగి సాగు పనులూ ప్రశ్నార్థకంగా మారాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. అక్కడక్కడ, అప్పుడప్పుడు భారీ వర్షాలు పడ్డా కూడా ఇవి సీజన్ మొత్తంపడే అవకాశంలేదని, అన్నదాతలు తొందరపడి నీటి అవసరం ఎక్కువుండే పంటలు వేయొద్దని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భూగర్భ జలాలు పడిపోతాయని, చెరువులు, కుంటలు, జలాశయాల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని... ఇలాంటి పరిస్థితుల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, చెరకు లాంటి పంటలు సాగుచేయొద్దని రైతులకు సూచిస్తున్నారు. చిరుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటలు సాగు చేయడం మేలని సూచిస్తున్నారు. బోరుబావుల కింద కూడా వరిసాగు చేయొద్దని ఇప్పటికే శాస్త్రవేత్తలతో పాటు ప్రభుత్వాలు కూడా అన్నదాతల్ని అప్రమత్తం చేశాయి. కూరగాయల పంటలు వేయాలని సూచించాయి. ఎల్‌నినో ప్రభావం పట్టణ ప్రాంతాలపై కూడా పడుతుందని ఆర్థిక, సామాజిక అధ్యయనాల కేంద్రం బాంబు పేల్చింది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఎల్‌నినో భారీ వర్షాలు, కరవులు, ఉష్ణప్రకోపం వంటి వాటిని ప్రేరేపిస్తుంది.

జూన్ నెలకు సంబంధించి దేశంలో మొత్తం రుతుపవన వర్షాల లోటు దాదాపు 40శాతంగా నమోదైంది. మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ వంటి అనేక ప్రాంతాలు 75 నుంచి 85శాతం వరకు లోటును ఎదుర్కొంటున్నాయి. ఈ సంవత్సరం వర్షపాత లోటు 60 శాతం వరకు ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ లోటు దేశ వ్యవసాయ రంగాన్ని, భూగర్భ జల నిల్వలను, నదులను, నీటిపారుదలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో 1875–77లో దారుణమైన కరవు సంభవించడానికి ఎల్‌నినోయే కారణం. ఆ కరవు ఇండియా, చైనా, ఈజిప్ట్, మొరాకో, ఇథియోపియా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, కొలంబియా, వెనెజువెలా దేశాలపై తీవ్ర ప్రభావం చూపి, అయిదు కోట్లకంటే ఎక్కువమందిని బలిగొంది. భారత్‌లో అప్పుడు సుమారు 56 నుంచి 96 లక్షల మంది మరణించారు. ఇప్పుడు కూడా ఎల్‌నినో కరువుకు దారితీస్తుందనే హెచ్చరికలు వెలువడుతున్నాయి. ఎల్‌నినో మనదేశ ఆర్థిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా పరిణమించింది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి ధరలు విపరీతంగా పెరుగుతాయి. రిటైల్ ద్రవ్యోల్బణం, టూవీలర్ల అమ్మకాలు, ట్రాక్టర్ల విక్రయాలు, ఖరీఫ్ నాట్లు, జలాశయాల నీటి నిల్వలు, అగ్రి ఉత్పత్తి, విద్యుత్ డిమాండ్, పరపతి వృద్ధిపై తీవ్ర ప్రభావం ఉంటుంది. సగటు వర్షపాతంలో మైనస్ 10.65 మేర లోటు నమోదవుతుంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఒకశాతం తగ్గుతుంది. ఆహార ఉత్పత్తి 4 శాతం క్షీణిస్తుంది. ఆహార ద్రవ్యోల్బణం సగటున 60 బేసిస్ పాయింట్లు పెరిగి ఎంఎస్ఎంఈలకు బ్యాంక్ లోన్లు దొరకడం కష్టమవుతుంది.

దేశ మొత్తం స్థూల అదనపు విలువలో వ్యవ సాయ రంగం వాటా 18 శాతంగా ఉంది. ఎల్నినో సంవత్సరాల్లో అగ్రి జీవీఏ వృద్ధి దాదాపు ఆగిపోతుంది. జీవీఏ వృద్ధి రేటు 350 బేసిస్ పాయింట్లు తక్కువగా ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 0.20 డిగ్రీలే పెరిగినప్పటికీ, కరెంటుకు డిమాం డ్ భారీగా పెరుగుతుంది. సాధారణంగా వర్షాకాలంలో తక్కువ ఖర్చుతో లభ్యమయ్యే జలవిద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. కానీ ఎల్‌నినో కారణంగా ఇప్పుడు జలవిద్యుత్తుకు అవకాశాల్లేకుం డా పోయాయి. దీంతో అనివార్యంగా థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచక తప్పదు. కానీ వానాకాలంలో బొగ్గును గనుల నుంచి వెలికితీయడం కూడా కష్టం. అయినా సరే తప్పనిసరి పరిస్థితుల్లో ఇప్పు డు అన్ని క్షేత్రస్థాయి ఇబ్బందుల్ని ఎదు ర్కుంటూ బొగ్గు వెలికితీయక తప్పదు. అయితే ప్రస్తుతం బొగ్గు నిల్వలు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో లేవు. దీంతో అధిక ధర పెట్టి ఇంధన ఎక్స్ఛేంజ్ నుంచి కరెంట్ కొనాల్సిన పరిస్థితి. తద్వారా ఆ భారం మళ్లీ అంతిమంగా వినియోగదారులపై బదిలీ అవుతుంది. అప్పుడూ సామాన్యులకు భారం తప్పదు. ఇలా ఎల్‌నినో కారణంగా వచ్చే ప్రతి సమస్యనూ సామాన్యులు ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో చవి చూడక తప్పదు.




# దేశంలో భారీగా కోటీశ్వరులు

భారత దేశం ప్రపంచంలో టాప్–5 సంపన్న దేశాల జాబితాలో చేరింది. గడిచిన పదేళ్లలో దేశ సంపద గణనీయంగా పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో 3వ స్థానానికి చేరాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇదే సమయంలో భారత దేశంలోనూ సంపన్నులు భారీగా పెరుగుతున్నారు. గడిచిన ఐదేళ్లలో దేశంలో కోటీశ్వరుల సంఖ్య 300 శాతం పెరగడమే ఇందుకు నిదర్శనం. ఇవన్నీ ఊహించి చెప్పేవి కావు. కేంద్రమే స్వయంగా పార్లమెంట్ లో వెల్లడించింది. ఐటీ రిటర్న్స్ ఆధారంగా ఈ లెక్కలు వెల్లడించింది.

అసెస్‌మెంట్ ఇయర్ 2025–26లో గ్రాస్ టోటల్ ఇన్‌కమ్ రూ.100 కోట్లు లేదా అంతకంటే ఎక్కువగా నమోదు చేసుకున్న వ్యక్తుల సంఖ్య 576కు చేరుకుంది. ఇది గతేడాది (2024–25) 415 ఉండగా, ఐదేళ్ల క్రితం (2021–22) కేవలం 142 ఉంది. గడిచిన 2022–23లో 301, 2023–24లో 284గా ఉండి, తర్వాత మళ్లీ పైకి ఎగిరింది. ఐదేళ్లలో 300 శాతానికి పైగా పెరుగుదల నమోదైంది.



### సంఖ్యలు చెప్పే కథ

ఈ పెరుగుదల కేవలం గణాంకాలు మాత్రమే కాదు. ఇది భారత ఆర్థిక వ్యవస్థలో ఎగువ స్థాయి ఆదాయం ఎలా కేంద్రీకృతమవుతోందో చూపిస్తుంది. స్టార్టప్‌లు, టెక్, ఫైనాన్స్, ఇక్విటీ మార్కెట్లు, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో విలువ సృష్టి, క్యాపిటల్ గెయిన్స్, హై–వాల్యూ లావాదేవీలు ఇలాంటి ఉన్నత ఆదాయాలకు దోహదం చేస్తున్నాయి. అదే సమయంలో టాక్స్ కంప్లయన్స్ మెరుగుపడడం, డిజిటల్ ట్రాకింగ్, ఐటీ విభాగం పర్యవేక్షణ కూడా ఈ సంఖ్యలు పెరగడానికి కారణం కావచ్చు. అయితే కేంద్రం తీసుకున్న చర్యలతో గతంలో నివేదించని ఆదాయం ఇప్పుడు రికార్డుల్లోకి వస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### కోటీశ్వరుల సంఖ్యపై అనిశ్చితి..

ఇక్కడ ఒక ముఖ్యమైన వ్యత్యాసం ఉంది. ఈ 576 మంది కోటీశ్వరులు కాదు. వారు సంవత్సరానికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం నమోదు చేసిన వ్యక్తులు. నిజమైన కోటీశ్వరులు (సంపద విలువ రూ.కోటి లేదా అంతకంటే ఎక్కువ) సంఖ్య దీనికి చాలా ఎక్కువగా ఉంటుంది. కానీ భారతదేశంలో సంపదపై అధికారిక, వ్యవస్థీకృత డేటా లేదు. ఆదాయపు పన్ను రిటర్న్స్ ఆదాయాన్ని మాత్రమే చూపిస్తాయి. ఆస్తులు, లయబిలిటీలు, నికర సంపదపై సమగ్ర సమాచారం అందుబాటులో లేదు. అందుకే దేశంలో నిజంగా ఎంతమంది కోటీశ్వరులు ఉన్నారన్నది ఇప్పటికీ అనిశ్చితమే.

### ఆర్థిక వృద్ధా.. అసమానతా..

ఈ పెరుగుదలను రెండు కోణాల నుంచి చూడవచ్చు. ఒకవైపు ఇది ఆర్థిక వృద్ధి, వ్యవసాయేతర రంగాల విస్తరణ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, పెట్టుబడులు పెరగడానికి సంకేతం. టాప్ ఎండ్‌లో ఆదాయం పెరగడం అంటే పన్ను రాబడి కూడా పెరగవచ్చు, ప్రభుత్వ వనరులు పెరగవచ్చు. మరోవైపు, 140 కోట్లకు పైగా జనాభా ఉన్న దేశంలో కేవలం కొన్ని వందల మంది మాత్రమే ఇంత భారీ ఆదాయం సాధించడం ఆదాయ అసమానతన ఎత్తి చూపుతుంది. మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ఆదాయాలు ఎలా మారుతున్నాయన్నది కూడా తెలుసుకోవాలి. కేంద్రం వెల్లడించాలి. రాబోయే సంవత్సరాల్లో టాక్స్ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారితే, సంపదపై కూడా కొంత సమాచారం అందుబాటులోకి రావచ్చు. అప్పుడు కోటీశ్వరులు అనే పదం ఆదాయం ఆధారంగా కాకుండా నికర సంపద ఆధారంగా మరింత కచ్చితంగా అర్థం చేసుకోవచ్చు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 30.07.2026
www.mudranews.in | @mudranews



### టీని 30 రోజులు మానేస్తే..

మానసిక ప్రశాంతత పెరుగుతుంది టీ ఎక్కువగా తాగడం వల్ల వచ్చే ఆందోళన, చిరాకు, ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా ఉంటుంది. గుండె వేగంగా కొట్టుకునే సమస్య కూడా తగ్గే అవకాశం ఉంది.



## అసమానతలు ఉన్నంతకాలం

# రిజర్వేషన్లు కొనసాగాలి

బండారు దత్తాత్రేయ    ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబీసీ మహాసభకు భారీగా తరలిరావాలని పిలుపు





**ముద్ర, హైదరాబాద్:** దేశంలో అసమానతలు, అస్పృశ్యత, కుల వివక్షత ఉన్నంతకాలం సామాజిక రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని, జనాభా దామాషా ప్రకారం బీసీలకు వాటా దక్కే వరకు జాతీయ స్థాయిలో ఉద్యమాన్ని ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభకు రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీలు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ కాచిగూడలోని అభినంద్ గ్రాండ్ హోటల్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన నిర్వహించిన అఖిలపక్ష బీసీ నేతల సంయుక్త సమావేశంలో బండారు దత్తాత్రేయ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నేత ఈరావత్ అనిల్ కుమార్, సిరికొండ మధు సూదనాచారి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ దేశంలో 60 శాతం బీసీల సంక్షేమం కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాస్తానని తెలిపారు. బీసీలకు చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశం నలుమూలల నుంచి బీసీలు బెంగళూరుకు తరలివచ్చి జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలంటే ఐక్య ఉద్యమం అవసరమని అన్నారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు బహుజన సమాజం ఏకమవ్వాలని కోరారు.మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, సిరికొండ మధు సూదనాచారి మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లు ప్రవేశపెట్టకపోతే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను నిర్లక్ష్యం చేస్తున్నాయని, హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.కాంగ్రెస్ నేత, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరావత్ అనిల్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో కులగణన అనంతరం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపినా, ఇప్పటి వరకు పార్లమెంట్‌లో ఆమోదం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ యువత, విద్యార్థులు, మహిళలు హక్కుల సాధన కోసం చట్టబద్ధంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.సమావేశంలో చిన్న శ్రీశైలం యాదవ్, గుజ్జ కృష్ణ, శేఖర్ సాగర్, తాటికొండ విక్రమ్ గౌడ్, కనకాల శ్యాంకుర్మా, భూదాని సదానందం, ఈడిగ శ్రీనివాస్ గౌడ్, కౌలే జగన్నాథం, వలపు శివకుమార్, తారకేశ్వరి తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు









### ఆలయాల్లో భక్తుల సందడి ప్రత్యేక పూజలు

**ముద్ర ప్రతినిధి, తాండూర్ :** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో గురు పౌర్ణమి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. బుధవారం గురు పౌర్ణమి సందర్భంగా కోకట్ రోడ్డు మార్గంలో ఉన్న శ్రీ షిర్డి సాయి బాబా మందిరానికి భక్తులు పోటెత్తారుప్రతి యేడాది మాదిరిగానే దేవాలయంలో సాయి బాబాకు ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులతో మూల విరాట్ విగ్రహానికి పూలాభిషేకం నిర్వహించారు. దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు.అదే విధంగా దేవాలయంలో పూజా కార్యక్రమాలలో తాండూరుకు చెందిన ప్రముఖ రియల్ ఏస్టేట్ వ్యాపారి భావనోళ్ల శంకర్ యాదవ్, సతీమణి చంద్రకళ, కుమారుడు అభినవ్ సాయి తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో బాబాకు కానుకలు సమర్పించి.. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిపించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ కార్యక్రమాలను చేపట్టారు.తాండూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీపా, బీఆర్ఎస్ నాయకులు పట్లోళ్ల నర్సింలు కూడా కుటుంబ సమేతంగా తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. మరోవైపు గురు పౌర్ణమి సందర్భంగా తాండూరు పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దేవాలయానికి భక్తుల తాకిడి కొనసాగింది. దేవాలయంలో బాబాను సర్మిస్తూ సాయి నామస్మరణను మార్మోగించారు. దీంతో దేవాలయానికి గురు పౌర్ణమి శోభ సంతరించుకుంది కార్యక్రమంలో తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల నరసింహులు, బంటు మల్లప్ప, కందుకూరి రాజ్ కుమార్, ప్రభాకర్ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**ముద్ర ప్రతినిధి, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలోని రైల్వే స్టేషన్ రహదారినగల ప్రసిద్ధిగాంచిన కాళికాదేవి ఆలయం ఆవరణలో భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత రెండు సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండాప్రతి పౌర్ణమికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. పౌర్ణమి రోజున ఆలయం దగ్గరికి వెళ్లి భోజనం చేయటం వల్ల ఆధ్యాత్మికంగా ఎంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తుల నమ్మకం, కావున ప్రతి పౌర్ణమి కి అనేకమంది భక్తులు, రహదారిన వెళ్లే బాటసారులు, నిరుపేదలు, కుల మతాలకు అతీతంగా ఎంతోమందికాళికామాత దేవాలయానికి వస్తుంటారు. అటువంటి నిరుపేదలకు, అన్నప్రసాద వితరణ చేయడం వల్ల మా యొక్క జన్మ ఎంతో సంతృప్తినిస్తుందని, భగత్ సింగ్ యూత్ సభ్యులు పేర్కొన్నారు. అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు. అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పది అనే సిద్ధాంతంతో ఈ యొక్క కార్యక్రమాన్ని ప్రారంభించామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భగత్ సింగ్ యూత్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు ఉన్నారు.

### అస్బెస్టోస్ కాలనీలో

**ముద్ర, కూకట్‌పల్లి :** అస్బెస్టోస్ కాలనీలో ఉన్న శ్రీ సీత రామలింగేశ్వర సాయి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కోసం భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ, గురుపౌర్ణమి ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని, భక్తులలో దైవ చింతన పెంపొందించేందుకు ప్రతి ఏటా ఇలాంటి ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రత్యేక ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ నరేష్, ఆలయ అధ్యక్షులు శివ కేశ్వర్, సంపత్, నర్సిములు, భాస్కర్ రెడ్డి, పొన్నాల నాగరాజ్, క్రాంతి, జగన్మోహన్ రెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొని సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాలుపంచుకున్నారు.

### గురుపౌర్ణమి వేడుకల్లో జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమ కుమార్

**ముద్ర, కూకట్‌పల్లి :** కెపిహెచ్‌బి కాలనీ 2వ రోడ్డులోని శ్రీ శ్రీ శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు ఎల్. నాగేశ్వరరావు, ఎల్. రాజా ల ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ కుటుంబ సమేతంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని భక్తులకు ప్రసాదాలు వడ్డించారు.అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ దంపతులను ఘనంగా శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, దుత్త శంకర్, సుంకర సాయి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కంగనా వ్యాఖ్యలను ఖండించిన సీపీఐ నేత కె. నారాయణ



**ముద్ర, హైదరాబాద్:** ప్రదర్శనకారులను ఉద్దేశించి గతంలో చేసిన "బొద్దింకలు (Cockroach)" వ్యాఖ్యల విషయంలో గౌరవ న్యాయమూర్తి, చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ సానుకూలంగా స్పందించడం అభినందనీయమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు కె. నారాయణ అన్నారు. తన వ్యాఖ్యల వల్ల కలిగిన బాధను గుర్తించి, వాటిని సరిదిద్దుకునే వైఖరి న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.అయితే, జెన్–జెడ్ యువత మరియు మహిళలను ఉద్దేశించి ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ చేసిన అవమానకరమైన, అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఏమాత్రం సమర్థనీయమైనవి కావని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే సమయంలో బాధ్యతాయుతంగా, సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ఇటువంటి వ్యాఖ్యలు సమాజంలో విభేదాలను పెంచడమే కాకుండా ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కె. నారాయణ స్పష్టం చేశారు. జెన్–జెడ్ యువతకు, మహిళలకు ఆమె బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు తమ వ్యాఖ్యల విషయంలో మరింత బాధ్యతతో వ్యవహరించడం అవసరమని పేర్కొన్నారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కవిత



**ముద్ర, సికింద్రాబాద్:** సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయనకు అందిస్తున్న వైద్య చికిత్స, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి భార్యతో పాటు ఇతర కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## గురుపౌర్ణమి వేడుకల్లో పీఏసీ చైర్మన్

**ముద్ర, హైదరాబాద్:** గురుపౌర్ణమి శుభసందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ కాలనీలో ఉన్న సాయిబాబా దేవాలయంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి సాయిబాబా ఆశీస్సులు పొందారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, గురువులను, ఉపాధ్యాయులను, పెద్దలను గౌరవించి పూజించే పవిత్ర దినమే గురుపౌర్ణమి లేదా వ్యాస పౌర్ణమి అని అన్నారు. ప్రతి సంవత్సరం ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురుపూజోత్సవాలు నిర్వహించి గురువులను సత్కరించి, వారి ఆశీర్వాదాలు పొందడం భారతీయ సంస్కృతిలో గొప్ప సంప్రదాయమని పేర్కొన్నారు.గురువు అంటే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించి, జీవితానికి సరైన మార్గాన్ని చూపించే వ్యక్తి అని గాంధీ తెలిపారు. గురువును భగవంతునికి, భక్తునికి మధ్య వారధిగా భావిస్తారని చెప్పారు. వేదాలను నాలుగు భాగాలుగా విభజించి మానవాళికి అమూల్యమైన ఆధ్యాత్మిక వారసత్వాన్ని అందించిన మహర్షి వేదవ్యాసుడు సమస్త మానవాళికి గురువని కొనియాడారు. అందుకే ఆయన జన్మదినమైన వ్యాస పౌర్ణమికి విశిష్ట స్థానం ఉందని వివరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాయినేని చంద్రకాంత్ రావు, సైదేశ్వర్ రావు, శ్రీనివాస్, చౌదరి, కృష్ణారావు, మల్లయ్య, పరమేశ్వర్ భక్తులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ముద్ర, కాప్రా:** హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాన్ని బట్టబయలు చేశాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విమర్శించారు. ప్రజల ఇళ్ల కూల్చివేత విషయంలో విస్తృత అధికారాలు వినియోగించిన హైడ్రా, చట్టపరమైన అంశాల్లో మాత్రం విఫలమైందని ఆరోపించారు.కోర్టు ఆదేశాలు, న్యాయపరమైన విధానాలను పట్టించుకోకుండా వ్యవహరించే అధికారులను ప్రభుత్వం వెనుకేసుకు రావడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. హైడ్రా పేరిట పేదలు, మధ్యతరగతి ప్రజల ఇళ్లపై బుల్డోజర్లు నడిపించి వేలాది కుటుంబాలను రోడ్డున పడేసిన ప్రభుత్వం, ఇప్పుడు హైకోర్టు వ్యాఖ్యలతో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన పరిసితి వచ్చిందని పేర్కొన్నారు.ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరో న్యాయం అనే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని బండారి లక్ష్మారెడ్డి విమర్శించారు. హైడ్రా చర్యలు చట్ట పరిరక్షణ కోసం కాకుండా రాజకీయ కక్షసాధింపుకు ఉపయోగపడుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచే చెబుతోందని, ఇప్పుడు హైకోర్టు వ్యాఖ్యలు కూడా అదే అంశాలపై ప్రశ్నలు లేవనెత్తాయని అన్నారు.నైతిక బాధ్యత ఉన్న ఏ అధికారి అయినా ఇలాంటి పరిస్థితుల్లో పదవిలో కొనసాగకూడదని పేర్కొన్న ఆయన, ఏ.వి. రంగనాథ్‌పై కోర్టు ధిక్కరణకు సంబంధించిన పలు కేసులు నమోదయ్యాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.అలాగే హైడ్రా పేరిట జరిగిన కూల్చివేతలు, ఎంపిక చేసిన చర్యలు, అధికార దుర్వినియోగంపై హైకోర్టు పర్యవేక్షణలో లేదా స్వతంత్ర న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా అహంకారపూరిత వైఖరిని వీడి, హైకోర్టు ఆదేశాలను అమలు చేసి ప్రజల రాజ్యాంగబద్ధ హక్కులను పరిరక్షించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు.

## బాల్యం నుంచి యోగా నేర్చుకోవాలి




**ముద్ర ప్రతినిధి, తాండూర్:** తాండూర్ పట్టణంలోని ఖాంజాపూర్ సమీపంలో గల తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్‌లో యోగ తరగతులు ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ పట్లోళ్ల నీరజ బాల్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, బాల్యం నుంచే మెగా అలవాటు చేసుకోవడం మంచిదనీ, చదువుతో పాటు ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ ఆటలు ఆడటంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం కూడా వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు.విద్యార్థి జీవితంలో విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఒక భాగంగా ఉండాలని, అప్పుడే సంపూర్ణమైన వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని తెలిపారు. గురుకులాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సహకారంతో గురుకులాల అభివృద్ధికి సహకరిస్తారని ఆమె తెలిపారు. మెగా గురూజీ ప్రవీణ్ సార్,పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 30.07.2026
www.mudranews.in | @mudranews



**టీని 30 రోజులు మానేస్తే..**
**దంతాలు ఆరోగ్యంగా మారుతాయి**

టీ వల్ల పళ్లపై ఏర్పడే మరకలు తగ్గుతాయి. చక్కెర కలిపిన టీకి దూరంగా ఉండటం వల్ల దంతక్షయం, నోటి దుర్వాసన కూడా తగ్గుతుంది.



# కొండగట్టు గిరి ప్రదక్షిణలో పాల్గొన్న మంత్రులు అడ్లూరి, పొన్నం

**ముద్ర న్యూస్ , కొండగట్టు** : గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామి గిరిప్రదక్షిణలు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో పాటు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

తెల్లవారుజాము నుండి వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా గిరి ప్రదక్షిణలు మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆంజనేయస్వామి చూడాలని కోరుకున్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.



# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి రిమాండ్



**ముద్ర, హైదరాబాద్ :** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కి ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఆగస్ట్ 11 వరకు ఆయనకు రిమాండ్ విధిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పోలీసులు ఆయన్ను చంచల్ గూడ జైలుకు తరలించారు. బుధవారం ఉదయం సీన్ రీకన్ స్ట్రక్షన్ కోసం ఉదయ్ ను పోలీసులు అశోక్ నగర్ తీసుకెళ్లారు. ఆయన ఉంటున్న గదిని అత్తాపూర్ సీఐ సీతయ్య పరిశీలించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. మహిళా ట్రైనీ ఐపీఎస్ పై లైంగిక వేధింపుల కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిని మంగళవారం రాత్రి హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 18న తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కర్ణాటకకు చెందిన మహిళా ట్రైనీ ఐపీఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై కేసు నమోదు చేశారు. డీసీపీ లావణ్యానాయక్ జాదవ్ ఆధ్వర్యంలో ఇన్ స్పెక్టర్ జ్యోత్స్న దర్యాప్తు చేపట్టారు. జాతీయ పోలీసు అకాడమీలో బాధితురాలి నుంచి వాంగ్మూలం సేకరించారు. ఆమెకు వైద్యపరీక్షలు నిర్వహించగా మెడ, గొంతు నులిమినట్లు ఆనవాళ్లు.. చెంప భాగంలో కమిలిన గాయాలు, ఎడమ కాలిపై దెబ్బలున్నట్లు నివేదికలో పేర్కొన్నారు. నిందితుడికి పోలీసులు నోటీసులిచ్చేందుకు హైదరాబాద్ లోని రెండు చిరునామాల్లో ప్రయత్నించగా దొరకలేదు. దీంతో 4 బృందాలను ఏర్పాటు చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ఉదయ్ కృష్ణారెడ్డి ఒంగోలులో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు సోమవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. అక్కడి నుంచి కర్ణాటకకు ప్రయాణమైనట్లు గుర్తించి మరో బృందం అక్కడకు వెళ్లింది. మరో రెండు బృందాలు సాంకేతిక ఆధారాలతో గాలింపు చేపట్టాయి. ఈక్రమంలో మంగళవారం మిర్యాలగూడ సమీపంలో ఉదయ్ కృష్ణారెడ్డి ఉన్నట్లు గుర్తించారు. ఆయన వాహనాన్ని పోలీసులు అనుసరిస్తూ హైదరాబాద్ కు చేరగానే అదుపులోకి తీసుకున్నారు.

# అనాథాశ్రమం నుంచి పారిపోయిన ఇద్దరు బాలికలు

**ముద్ర న్యూస్ :** సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బాలసాధన కేంద్రంలో ఉంటున్న ఇద్దరు అనాథ బాలికలు పారిపోయినట్లు బాలసదన్ సూపరింటెండెంట్ వనిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. బాల సదన్ కేంద్రంలో గత కొంతకాలంగా నివాసముంటున్న ఇద్దరు బాలికలు గోడదూకి పారిపోయారని తెలిపారు. బుధవారం తెల్లవారుజామున వారు కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలికల కోసం గాలింపు చేపట్టారు.

# గ్రామాల అభివృద్ధిలో అధికారులు బాధ్యతతో పనిచేయాలి

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**




**ముద్ర న్యూస్ , వెల్గటూర్ :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే దిశగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం వెల్గటూర్ మండల ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన అభివృద్ధి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీల అవసరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా, అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం ఎస్ఐఆర్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ను వంద శాతం పూర్తి చేసిన బీఎల్ఓలను మంత్రి సన్మానించి అభినందించారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోటి నవదుర్గ అమ్మవారి "మనసార మన సారె" మహోత్సవం



**ముద్ర, కోరుట్ల;** ఆషాఢ మాసోత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని శ్రీ శివమారాండేయ కోటి నవదుర్గ దేవాలయంలో మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించిన "మనసార మన సారె" మహోత్సవం భక్తుల భక్తిశ్రద్ధల మధ్య ఆలయ అర్చకులు దేగామ ప్రదీప్ శర్మ, శ్రీధర్ శర్మ శాస్త్రోక్తంగా ప్రత్యేక వైదిక నిర్వహణలో విజయవంతంగా ముగిసింది. ఈ మహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో, మంగళ వాయిద్యాలతో శోభాయాత్రగా దేవాలయానికి చేరుకుని అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో 108 రకాల విశేష మంగళ నైవేద్యాలను "మనసార మన సారె" గా సమర్పించారు. సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించబడింది. వందలాది మంది మహిళలు ఏకస్వరంతో లలితా సహస్రనామాన్ని పారాయణం చేయడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జై భవానీ, జై జై దుర్గా నామ స్మరణలు, వేద మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమ అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పాల్గొన్న భక్తులందరికీ మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించి తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గుంటుక ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ జిల్లా ధనంజయ్, యువత అధ్యక్షులు జక్కుల ప్రవీణ్ కుమార్, లలిత పారాయణ బృందం సభ్యులు మచ్చ కవిత, మంచాల రోజా రమణి, జిల్లా దీపారాణి, ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఫీజు బకాయి - బీజేపీ లడాయి పోస్టర్ల ఆవిష్కరణ

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రభుత్వం నుంచి ఫీజుల రీ ఇంబర్స్మెంట్ రానందుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ఫీజుల బకాయి –బీజేపీ లడాయి పోస్టర్లు ఆవిష్కరించారు. భారతీయ జనతా యువ మోర్చాఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంట్ మరియు స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడడం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిజెవై యం జిల్లా అధ్యక్షుడు దొడ్డికింది నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడవద్దని హెచ్చరించారు. ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయని పక్షంలో 'ఫీజుల బకాయి – బీజేపీ లడాయి' ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేవై ఎం జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, బీజేపీ సీనియర్ నాయకులు సాదం అరవింద్, జంగం వీరేష్ , జమాల్, జుట్టు దినేష్,ఇర్ల విజయ్, శ్రీకాంత్ రెడ్డి,కందుల హరీష్, భరత్ కౌన్సిలర్లు రాజు, నరేష్, శశాంక్ బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# భగత్‌నగర్ దోపిడీ.. అదుపులో నిందితులు?

**ముద్ర, కరీంనగర్ :** కరీంనగర్ భగత్‌నగర్‌లో జరిగిన దోపిడీ కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుల సంఖ్య మూడుకు చేరినట్లు సమాచారం. నిందితుల సమాచారం మేరకు దోపిడీ చేసిన బంగారంలో కొంత మేరకు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దోపిడీకి పథకం వేసిన వారితోపాటు స్వయంగా పాల్గొన్న నిందితుల కోసం పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. దోపిడీకి వేసిన పథకం, నిందితుల సంచార మార్గాలు, నిందితులకు సమాచారం అందించిన వారి పూర్తి వివరాలపై పోలీసులు లోతుగా విచారణ చేపట్టారు.

# వన మహోత్సవం పచ్చని భవిష్యత్తుకు నాంది



**ముద్ర చిగురుమామిడి:** చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం గ్రామ సర్పంచ్ సన్నిల్ల కవిత ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిమ్మాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ భారతి హాజరై చెరువు కట్ట కు ఇరువైపులా ఖర్జూర ఈత చెట్లను నాటారు. సర్పంచ్, ఎక్సైజ్ ఎస్సై తదితరులు మాట్లాడుతూ వన మహోత్సవం అనేది భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై మొదటి వారంలో జూలై 1 నుండి 7 వరకు నిర్వహించే ఒక వారం రోజుల చెట్ల పెంపక పండుగ అని దీని యొక్క ప్రధాన ఉద్దేశం భారీ ఎత్తున మొక్కలు నాటడం, పర్యావరణాన్ని రక్షించడం, అటవీ సంపద ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం. ఈ కార్యక్రమన్ని 1950 లో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కె.ఎం. మున్షి ప్రారంభించారు దేశంలో వర్షాకాలం నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయం కావడంతో మొక్కలు త్వరగా పెరగడానికి జూలై మొదటి వారాన్ని ఎంపిక ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం భూమిపై పచ్చదనాన్ని పెంచడం.. కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణ సమతుల్యతను కాపాడడం... నేల కోతను నివారించడం.. భూగర్భ జలాలను పెంపొందించడం.. పండ్ల మొక్కలు, కలప పశువులకు కావలసిన మేతను అందించే చెట్లను కూడా ప్రోత్సహించడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు

ఈ కార్యక్రమంలో సర్పంచ్ సన్నిల్ల కవిత ఎక్సైజ్ ఎస్సై భారతి వార్డు సభ్యులు వెంకటేశం గౌడ్ మంద శ్రీనివాస్ అన్నవేణి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ వెంకటేష్ పంచాయతీ కార్యదర్శి సంపత్ ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్ మహిళా సమైక్య సీఏలు లత రమ గౌడ సంఘ సభ్యులు మధు గౌడ్ వెంకటేశం గౌడ్ శేఖర్ గౌడ్ బిక్షపతి గౌడ్ రాజేశం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ లో భారీ వర్షం.. కలెక్టరేట్‌లో నిలిచిన నీరు





**- ఉద్యోగులు, ప్రజలకు ఇబ్బందులు**

**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ లో అర్ధరాత్రి నుంచి ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురుస్తోంది. దీంతో మురుగునీటి కాలువలు పొంగిపొర్లుతున్నాయి. మట్టి రహదారులన్నీ బురదమయమయ్యాయి. నగర్ శివారు ప్రాంతాలో ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలుస్తోంది. కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్లే రహదారిలో ఆర్టీసీ వర్క్ షాప్ దగ్గర రహదారిపై నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు సానిటేషన్ కార్మికులు చర్యలు చేపడుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మరోవైపు మంచిర్యాల చౌరస్తా, ఆర్టీసీ వర్క్ షాప్, రాంనగర్ ప్రాంతాల్లో వరద నీరు నిలవకుండా డీఆర్ఎఫ్ సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్త చెదారం తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. వర్ష పరిస్థితిని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కరీంనగర్ కలెక్టరేట్ ప్రాంగణం బురదమయంగా మారింది. కలెక్టరేట్ లోని గాంధీ విగ్రహం పరిసరాలు, బ్యాంకు ఎదుట, పార్కింగ్ స్థలం, ఆడిటోరియం వెనుక భాగంలో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ఉద్యోగులు, వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు అంతరాయం కలిగాయి. అలాగే కలెక్టరేట్ లోని కొన్ని శాఖల కార్యాలయాల్లోకి వర్షపు నీరు చేరి, పైకప్పుల నుంచి లీకేజీలు ఏర్పడటంతో సిబ్బంది అసౌకర్యానికి గురయ్యారు.మరో రెండు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, కలెక్టరేట్ ప్రాంగణంలో నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు, ఉద్యోగులు కోరుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు వర్షపు నీరు వేగంగా బయటకు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 30.07.2026
www.mudranews.in | @mudranews



**టీని 30 రోజులు మానేస్తే..**



ఐరన్, క్యాల్షియం శోషణ పెరుగుతుంది
టీని తగ్గించడం వల్ల ఆహారంలోని ఐరన్, క్యాల్షియంను శరీరం మెరుగ్గా గ్రహిస్తుంది. దీంతో రక్తహీనత ప్రమాదం తగ్గి ఎముకలు బలపడతాయి.

## 108 బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో స్వామివారికి పాదపద్మార్చన

కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి బుధవారం 108 ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో అష్టదళ పాదపద్మార్చన సేవను విశేషంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోప్పష్ట దర్శనం,పట్టు పీతాంబరాలు ధరింపజేసి, సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.

- ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి



## తండ్రి లేని ఇద్దరు బాలికల చదువుకు అండగా..

కాంగ్రెస్ నాయకులు పచ్చిమట్ల శివరాజ్ గౌడ్
మాట నిలబెట్టుకుని వరుసగా ఫీజులు చెల్లింపు
ఇంటర్ పూర్తయ్యే వరకు సహాయం చేస్తానని హామీ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** చదువే పేద పిల్లల భవిష్యత్తును మార్చగల శక్తి అనే నమ్మకంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు పచ్చిమట్ల శివరాజ్ గౌడ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. భువనగిరి మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన గుర్రం బిక్షపతి మృతి చెందగా ఆయన కుమార్తెల విద్యాభ్యాసానికి అండగా నిలుస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. పెద్ద కుమార్తె కీర్తన ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, చిన్న కుమార్తె లహరి ఎనిమిదో తరగతి చదువుతోంది. గత విద్యా సంవత్సరంలో కీర్తన పదో తరగతి ఫీజులతో పాటు లహరి ఏడో తరగతి ఫీజులు, పాఠ్యపుస్తకాల ఖర్చును శివరాజ్ గౌడ్ భరించారు. లహరి పదో తరగతి వరకు విద్యాభ్యాసానికి అవసరమైన ఫీజులను తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు.ఆ హామీ మేరకు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన లహరి ఎనిమిదో తరగతి ఫీజులను చెల్లించి తన మాట నిలబెట్టుకున్నారు. అలాగే పెద్ద కుమార్తె కీర్తన ఇంటర్ రెండు సంవత్సరాల కాలేజీ ఫీజులను తానే భరిస్తానని ప్రకటించి ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. నిరుపేద పద్మశాలి కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శివరాజ్ గౌడ్ మానవత్వంతో చేసిన సాయానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలికల తల్లి గుర్రం విజయ, బాబాయ్ గుర్రం ఉపేందర్, బింగి వైకుంఠం పాల్గొన్నారు.

## మున్నేరు చెక్‌డ్యామ్ కూల్చివేత విధ్వంసకర నిర్ణయం

బీఆర్ఎస్ నేతలు



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఖమ్మం నగరంలోని ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరు వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేయడం ప్రజా ప్రయోజనాలను విస్మరించిన విధ్వంసకర చర్య అని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. చెక్‌డ్యామ్‌ను సందర్శించిన వారు అక్కడ ఆందోళన చేపట్టి ప్రభుత్వ తీరును తప్పుబట్టారు.కేసీఆర్ హయాంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చొరవతో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ చెక్‌డ్యామ్ వల్ల భూగర్భ జలమట్టం పెరిగి, నగరానికి తాగునీటి సమస్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. రాజకీయ కక్షసాధింపుతోనే ప్రభుత్వం ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు లేకుండా చెక్‌డ్యామ్‌ను కూల్చివేసిందని ఆరోపించారు.మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో చెక్‌డ్యామ్ వల్లే వరదలు వస్తున్నాయన్న ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితుల్లో నీటి వనరులను సంరక్షించాల్సిన సమయంలో చెక్‌డ్యామ్‌ను తొలగించడం వల్ల భవిష్యత్తులో ఖమ్మం నగరం తీవ్ర తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గుండాల కృష్ణ, బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు, బత్తుల మురళీప్రసాద్, పాలడుగు పాపారావు, మాటేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మాస్ లైన్ జిల్లా కార్యదర్శిగా పుల్లయ్య



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) జిల్లా కార్యదర్శిగా సి.వై. పుల్లయ్యను ఏకగ్రీవంగా ఖమ్మం జిల్లా కమిటీ సమావేశం ఎన్నుకుంది. ఇప్పటి దాకా జిల్లా కార్యదర్శిగా కొనసాగిన గోకినేపల్లి వెంకటేశ్వరరావు పై కమిటీల బాధ్యతల రీత్యా జిల్లా బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. ఆ స్థానంలో విద్యార్థి, యువజన, ప్రజా ఉద్యమాలలో 3 దశాబ్దాల కాలంగా పనిచేస్తున్న సి.వై. పుల్లయ్యను రాష్ట్ర బాధ్యుల సమక్షంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సమావేశం జిల్లాలో రైతాంగం, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న పరిస్థితులను చర్చించింది. జిల్లాలో ప్రజా ఉద్యమ నిర్మాణానికి అనేక కార్యక్రమాలు తీసుకున్నది.సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, రాష్ట్ర నాయకులు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, రామయ్య, అశోక్, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, బందెల వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ నైతిక ఓటమిని అంగీకరించాలి

తమ్మినేని వీరభద్రం



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా నైతికంగా ఓడిపోయిందని, అధ్యక్షుడు ట్రంప్ ఆ ఓటమిని అంగీకరించి చర్చల ద్వారా యుద్ధాన్ని ముగించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా సీపీఎం నేతలు నీట్ అంశంపై విద్యార్థుల ఉద్యమాన్ని స్వాగతిస్తూ, ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకునేందుకు సీతారామ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ప్రజా ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ఖమ్మం రూరల్ మండలంలో రూ.7.21 కోట్లతో చేపట్టనున్న రెండు బీటీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలతో కలిపి మొత్తం 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని చెప్పారు. మిగిలిన గ్రామాలకు త్వరలోనే ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపడతామని తెలిపారు.రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున రూ.9,200 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, రూ.2 లక్షల వరకు రుణమాఫీ ద్వారా 25 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారత, ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పోరాటాలు, నిరసనలు ప్రజల హక్కు

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** ప్రజాస్వామ్య దేశంలో ప్రజా వ్యతిరేక విధానాలపై శాంతియుతంగా పోరాటాలు, నిరసనలు చేపట్టడం ప్రజల హక్కని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. ఖమ్మంలో జరిగిన సీపీఐ సభ్యుల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ, ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.నీట్ అంశంపై విద్యార్థుల ఉద్యమాన్ని అణచివేయడం, నిరసనకారులపై కేసులు నమోదు చేయడం సరికాదని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు.

## రెయిన్‌బో పాఠశాలలో 'రెడ్ కలర్ డే' వేడుకలు




**ముద్ర, కొండమల్లేపల్లి:** కొండమల్లేపల్లి పట్టణంలోని సాగర్ రోడ్డులో గల రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 'రెడ్ కలర్ డే' వేడుకలను చిన్నారుల ఉత్సాహం మధ్య ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఎరుపు రంగు దుస్తులు ధరించి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆపిల్, స్ట్రాబెర్రీ, టమాటా, గులాబీ వంటి ఎరుపు రంగు వస్తువులను పరిచయం చేస్తూ రంగులపై అవగాహన కల్పించారు. వివిధ ఆటలు, వినోదాత్మక కార్యక్రమాల ద్వారా చిన్నారులు ఆనందంగా నేర్చుకున్నారు.పాఠశాల కరస్పాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు చిన్నారుల్లో రంగులపై అవగాహనతో పాటు పరిశీలనా నైపుణ్యం, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫర్వీన్ సుల్తానా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యంపై దాడి అని, విద్యార్థులపై కక్షసాధింపు చర్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు.యాదాద్రి భువనగిరిలో జరిగిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం పారదర్శకంగా విచారణ జరిపి, పరీక్షల నిర్వహణలో సంస్కరణలు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల సమస్యలను అణచివేయకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు.అయోధ్య రామమందిరం విరాళాల నిర్వహణలో అవకతవకల ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగం, ధరల పెరుగుదల, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు.సెప్టెంబర్ 8, 9, 10 తేదీల్లో యాదగిరిగుట్టలో జరిగే ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 7న హైదరాబాద్‌లో పెన్షనర్ల మహాధర్నా

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 7న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశపుల్లయ్య తెలిపారు.డీఎస్ నకారా వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పీఆర్సీ అమలు, ఆరు విడతల డీఏ బకాయిలు, హెల్త్ కార్డులు, ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, పెండింగ్ బకాయిల చెల్లింపు వంటి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో డీఎస్ నకారా చిత్రపటానికి నివాళులర్పించి, పెన్షనర్ల డిమాండ్ల పోస్టర్లను ఆవిష్కరించారు.

## అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట

ఎస్పీ నరసింహ



**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** ప్రజల్లో అవగాహన, అప్రమత్తత పెరిగినప్పుడే సైబర్ మోసాలను అరికట్టవచ్చని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పోలీసు అధికారులు, సైబర్ వారియర్ సిబ్బందితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.సైబర్ మోసాల ఫిర్యాదులను వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. బాధితులకు మోసపోయిన నగదు త్వరగా రిఫండ్ అయ్యేలా బ్యాంకులు, కోర్టులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.ప్రజలు తమ బ్యాంక్ ఓటీపీ, ఏటీఎం పిన్ వంటి వివరాలను ఎవరికీ చెప్పొద్దని, అనుమానాస్పద కాల్స్, లింకులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో వచ్చే మోసాలను నమ్మవద్దని సూచించారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి, తొలి గంటలోనే ఫిర్యాదు చేయాలని ఎస్పీ నరసింహ తెలిపారు.

## వైభవంగా గురుపూర్ణిమ మహోత్సవాలు



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** గురుపూర్ణిమను పురస్కరించుకొని మండలంలోని రమణేశ్వరంలో బుధవారం మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు విచ్చేసి సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి దివ్య దర్శనం పొందారు.ఈ సందర్భంగా సిద్ధగురు మాట్లాడుతూ గురుపూర్ణిమకు ఎంతో విశిష్టమైన ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉందని వివరించారు. భగవాన్ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన అనంతరం తన తొలి ధర్మోపదేశాన్ని కాశీ సమీపంలోని సారనాథ్‌లో ఈ పౌర్ణిమ రోజునే అందించారని, అందువల్ల ఈ రోజును గురుపూర్ణిమగా ఆచరిస్తున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తి తన సద్గురువును భక్తిశ్రద్ధలతో ఆరాధించడంతో పాటు పరమశివుడినీ, భగవాన్ బుద్ధునినీ ఈ పవిత్ర దినాన పూజించాలని సూచించారు. గురుపూర్ణిమ వేడుకల్లో భాగంగా సిద్ధగురు భక్తులతో కలిసి సామూహిక ధ్యానం నిర్వహించారు. అనంతరం పంచకుండాత్మక హవనం, భగవాన్ బుద్ధునికి అభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

### ఐదు కుండీల గాయత్రీ యజ్ఞం

**ముద్ర, దేవరకొండ:** గురుపౌర్ణమి సందర్భంగా కొండమల్లేపల్లి పట్టణంలోని వినాయక్‌నగర్ గణపతి దేవాలయం వద్ద అఖిల విశ్వ గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ఐదు కుండీల గాయత్రీ యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.వేద పండితుల ఆధ్వర్యంలో గాయత్రీ యజ్ఞం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాల గణపతి శర్మ, డేరం జయప్రకాష్ శర్మ, తోటపలి కిరణ్, సుధాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, తోటపల్లి శ్రీనివాస్, బత్తుల కృష్ణయ్య, బత్తుల జంగయ్యతో పాటు గాయత్రీ పరివార్ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### నామ తల్లిదండ్రుల స్మృతి వనాన్ని సందర్శించిన లెఫ్టినెంట్ గవర్నర్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం:** జమ్మూ & కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఖమ్మం పర్యటన లో భాగంగా రూరల్ మండలం గొల్లగూడెం గ్రామంలో ఉన్న నామ ముత్తయ్య–వరమ్మ స్మృతివనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తల్లిదండ్రులు నామ ముత్తయ్య, వరమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని సందర్శించి, నామ ముత్తయ్య–వరమ్మ జీవిత విశేషాలు, సమాజానికి అందించిన సేవల గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. అక్కడ ప్రదర్శించిన అరుదైన చిత్రాలను పరిశీలించారు. ఆ గ్యాలరీ ఫోటోల విశేషాలను నామ సోదరుడు సీతయ్య వివరించారు.

## ఆర్.కే క్రషర్ రద్దుకు జేఏసీ కమిటీ ఏర్పాటు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** ఆర్.కే క్రషర్‌ను శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తుక్కాపురం, గౌస్‌నగర్, నమాత్‌పల్లి, ఎర్రంబెల్లి గ్రామాల ఆధ్వర్యంలో జేఏసీ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ కన్వీనర్‌గా పుట్ట వీరేష్ యాదవ్, కో–కన్వీనర్‌గా పాక వెంకటేష్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ ఆర్.కే క్రషర్ వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దానిని శాశ్వతంగా రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, నమాత్‌పల్లి సర్పంచ్ అతికం అరుణ–లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ముద్ర, దేవరకొండ:** నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు చింతపల్లి మండల కేంద్రంలో పోలీసులు ప్రత్యేక డాగ్ స్క్వాడ్‌తో కలిసి విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాను అరికట్టడమే లక్ష్యంగా హోటళ్లు, పాన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో సోదాలు చేపట్టారు.ఈ సందర్భంగా చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామ్మూర్తి మాట్లాడుతూ, యువత భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత పదార్థాల విక్రయం, రవాణాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 30.07.2026
www.mudranews.in | @mudranews



### టీని 30 రోజులు మానేస్తే..



శరీరం హైడ్రేటెడ్‌గా, చర్మం కాంతివంతంగా టీకి బదులుగా ఎక్కువ నీరు తాగితే శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. దీంతో చర్మం తాజాగా, కాంతివంతంగా కనిపించడమే కాకుండా అలసట కూడా తగ్గుతుంది.

## ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలి

* ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి
* విద్యార్థులకు మాజీ మంత్రి హరీశ్ రావు దిశానిర్దేశం





**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** ఉచిత ఇంజనీరింగ్, కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ లలో సీట్లు సాధించిన విద్యార్థులకు సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై, జాతీయ స్థాయి సంస్థల్లో ప్రవేశాలు పొంది ప్రతిభ చాటిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఐఐటీ, ఎన్ఐటీలలో సీటు రావడం మామూలు విషయం కాదని, ఆ ఒక్క సీటుతో ఆ విద్యార్థి జీవితంతో పాటు వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులు పూర్తిగా మారిపోతాయని అన్నారు. గ్రామీణ ప్రాంత పిల్లల భవిష్యత్తు మార్చాలనే గొప్ప ఉద్దేశంతో 'కెరీర్ గైడెన్స్ సెల్' ఏర్పాటు చేసి, వారికి ఉచితంగా మార్గనిర్దేశం చేస్తున్న కొలుపుల రాములు కృషి వెలకట్టలేనిదని ప్రశంసించారు. ఒక ఉపాధ్యాయుడిగా తన వంతు సామాజిక బాధ్యతగా సొంత పిల్లల్లాగా భావించి వాట్సాప్ ఛానళ్లు, కౌన్సిలింగ్ ద్వారా ఆయన వేలాది మందికి అండగా నిలవడం గొప్ప విషయమన్నారు.ఒకప్పుడు ఐఐటీ, ఎన్ఐటీ సీట్లు అనగానే కేవలం హైదరాబాద్‌లోని కార్పొరేట్ స్కూళ్లలో చదివే పిల్లలకే వస్తాయనే అపోహ ఉండేదని, కానీ పట్టుదల, ఏకాగ్రత ఉంటే గ్రామీణ విద్యార్థులు కూడా అద్భుతాలు సాధించగలరని ఈ విద్యార్థులు నిరూపించారని కొనియాడారు. రాములు కృషితో ఇప్పటికే సుమారు మూడు వేల మంది విద్యార్థులు అత్యుత్తమ కళాశాలల్లో సీట్లు పొందడం ఒక గొప్ప మార్పునకు సంకేతమన్నారు.విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ పూర్తి కాగానే వెంటనే ప్రైవేటు ఉద్యోగాల్లో చేరిపోవడం కాకుండా, సివిల్ సర్వీసెస్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, డిఫెన్స్ తదితర ఆల్ ఇండియా సర్వీసెస్ వైపు దృష్టి సారించాలని సూచించారు. జాతీయ స్థాయిలో మన ప్రాంత అధికారుల ప్రాతినిధ్యం మరింత పెరగాలని, మన బిడ్డలు సివిల్ సర్వెంట్లుగా దేశానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.చదువు పూర్తయ్యాక కేవలం ఉద్యోగాలు అడిగే వారుగా కాకుండా, తమ నైపుణ్యంతో పది మందికి ఉద్యోగాలు ఇచ్చే వారుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ యుగంలో ప్రపంచం మొత్తం యువత చేతుల్లోనే ఉందని, వినూత్న ఆలోచనలతో స్టార్టప్‌లు స్థాపించి 20 నుంచి 24 ఏళ్ల యువతే గూగుల్, అమెజాన్ లాంటి సంస్థలను ఆకర్షిస్తున్నారని గుర్తుచేశారు. ఆ దిశగా మన విద్యార్థులు కూడా ఆలోచన చేయాలన్నారు.విద్యార్థులు ఎప్పుడూ 'థింక్ బిగ్' అనే సూత్రాన్ని నమ్మాలని, లక్ష్య సాధనలో ఒకటి రెండు సార్లు విఫలమైనా పట్టువిడవకుండా శ్రమించాలని సూచించారు. ఇప్పటికే అత్యుత్తమ సంస్థల్లో సీట్లు సాధించి తమ సత్తా నిరూపించుకున్న విద్యార్థులు, భవిష్యత్తులోనూ అదే ఆత్మవిశ్వాసంతో అద్భుతాలు సృష్టించి తమ తల్లిదండ్రులకు, సిద్దిపేటకు మంచి పేరు తీసుకురావాలని ఆయన మనస్ఫూర్తిగా దీవించారు.

## పట్టుపురుగుల పెంపకంపై రైతులు దృష్టి సారించాలి

సిద్ధిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** అత్యధిక ఆదాయం సమకూర్చే పట్టుపురుగుల పెంపకం పై జిల్లా రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో మేరా రేషన్ మేరా అభియాన్-2.0 (నా పట్టు నా అభిమానం 2.0) కార్యక్రమం కింద జిల్లా స్థాయి భాగస్వామ్య వర్గాల సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ కె. హేమావతి హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ తెలంగాణ రాష్ట్ర నోడల్ అధికారి లత, పట్టు పరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంద్రసేనారెడ్డి జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధి కోసం చేపట్టిన చర్యలను వివరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో అత్యధిక ఆదాయం సమకూర్చేది పట్టు పరిశ్రమ అని అన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1313 ఎకరాలలో 482 మంది పట్టు రైతులు మల్బరీ సాగు చేస్తున్నారని అన్నారు. 2026-27 సంవత్సరానికి గాని 200 ఎకరాల లక్ష్యం కాగా ఇప్పటికి 42 ఎకరాలు చేరుకోవడం జరిగిందని అన్నారు. ప్రస్తుత ఎల్ నినో తరుణంలో రైతులను పట్టు పరిశ్రమకు మార్చడం కొంచెం సులభం అవుతుందని ఈ దిశగా పట్టు పరిశ్రమశాఖ అధికారులు రైతులను మోటివేట్ చేయాలని అన్నారు.పట్టుపురుగుల పెంపకానికి మన జిల్లా అనుకూలమైనదని అదేవిధంగా మార్కెటింగ్ అవకాశాలు కూడా ఉన్నాయని అన్నారు. పట్టు పరిశ్రమ పరిశ్రమ ద్వారా రైతులకు నెలనెల ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఒక ఎకరం వరి పండించే నీటితో రెండు ఎకరాల మల్బరీ తోటలను పండించవచ్చని అన్నారు. ఒక ఎకరానికి సంవత్సరానికి 5 సార్లు పంట చేతికి వస్తుందని, 1 ఎకరాకి ఒక సంవత్సరంలో 2 నుంచి 3 లక్షల రూపాయల ఆదాయం సంపాదించవచ్చని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే పట్టుపురుగుల పెంపకం ద్వారా ఆదాయాన్ని పొందుతున్న రైతులు జిల్లాలోని ఇతర రైతులకు పట్టు పరిశ్రమ ద్వారా పొందే ఆదాయాన్ని వివరించి వారికి పట్టుపురుగుల పెంపకంలో అవసరమైన సూచనలు, సలహాలు అందించి లాభదాయకమైన పట్టుపురుగుల పెంపకంపై రైతులకు ఆసక్తి కలిగేల చూడాలని అన్నారు. జిల్లాలో పట్టుపురుగుల మార్కెటింగ్ కొరకు అవసరమైతే భూమిని కేటాయిస్తానని ఈ దిశగా పట్టు పరిశ్రమ శాఖ అధికారులు జిల్లాలో పట్టు పరిశ్రమ అభివృద్ధికి అధికంగా చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విజయవంతమైన పట్టు క్షేత్రాలకు రైతులతో టూర్లు నిర్వహించాలని అన్నారు. అలాగే భూగర్భ జలాలను పెంచుకునే దిశగా రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలలో విబి జి రాంజీ పథకం ద్వారా ఉచితంగా ఫామ్ పాండ్లను తప్పనిసరిగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేరా రేషన్ మేరా అభియాన్ 2.0 రాష్ట్ర నోడల్ అధికారి తిరుపం రెడ్డి, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, పట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు.బుధవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో వర్షాల అప్రమత్తతపై అధికారులతో సమీక్షించారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పాడుబడిన ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, కమ్యూనిటీ హాళ్లను పరిశీలించి, ఎవరైనా అందులో నివసిస్తుంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.వర్షాల సమయంలో వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని సూచించారు. వరద నీటిలో ప్రయాణించడం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితులు మినహా భారీ వర్షాల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగి పడిన ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని, అలాంటి సంఘటనలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాల ప్రజలు నీటి మట్టాన్ని నిరంతరం గమనిస్తూ, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలను సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు.వాహనదారులు భారీ వర్షాల సమయంలో అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్త వహించాలని, నీరు నిలిచిన రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.జిల్లా యంత్రాంగం అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలకు సిద్దంగా ఉంచిందని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ప్రజల సహకారంతోనే వర్షాల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమ కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ సమీక్షలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీడీవోలు,జిల్లా అధికారులు, పాల్గొన్నారు.జిల్లాలో 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి జిల్లాలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుందని, ఇప్పటి వరకు జిల్లాలో 90 శాతం పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై రాష్ట్ర ఎలక్టోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్.ఐ. ఆర్ ప్రక్రియ పై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో మొత్తం ఓటర్లు 4,53140 కి గాను వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాలు ఓటర్లకు అందజేసి ఇప్పటి వరకు 90 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను 90 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వివరించారు. రెండు మూడు రోజుల్లో వందశాతం డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ సైతం చేపట్టడం జరుగుతుందన్నారు.

### ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలుకు కట్టుబడి పనిచేయాలి

డాక్టర్ సంగీత సత్యనారాయణ



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:** కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) అమలుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో తొలి ఏబీడీఎం మోడల్ జిల్లాగా యాదాద్రి భువనగిరి ఎంపికైన సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిటల్ ఆరోగ్య రికార్డులు, డిజిటల్ ప్రిస్క్రిప్షన్లు, ఆరోగ్య సేవల డిజిటలైజేషన్‌పై నేషనల్ హెల్త్ అథారిటీ నిపుణులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, వైద్యులు, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

### ప్రెస్ క్లబ్ ఎన్నికలు ప్రశాంతం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్ భవనంలో జరిగిన ఎన్నికల్లో 98 మంది ఓట్లకు గాను 96 మంది వినియోగం చేసుకున్నారు. ఓటర్లు బారులు తీరి ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. సీనియర్ విలేకరులు బాలేశ్వర్ , దేవయ్య, శ్రీధర్, మురళి, ఫారూక్, ఖయ్యాం, హరినాథ్, బీవీకే రాజు, శంకర్ దయాల్ చారి, గోపాల్ గౌడ్ తో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, సర్పంచ్ సాయిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.హోరాహోరీగా ఎన్నికలు జరుగగా, అధ్యక్ష స్థానానికి గుట్టమీది ప్రకాష్, శివన్నగారి నర్సింహచారి తలపడ్డారు. ప్రకాశ్ కు 42 ఓట్లు రాగా, నర్సింహచారికి 54 ఓట్లు వచ్చాయి. 12 ఓట్ల మెజార్టీతో నర్సింహచారి అధ్యక్షుడిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శి పదవికి చెవిటి అశోక్, బచ్చు సంగమేశ్వర్ పోటీ పడగా, అశోక్ కు 44 ఓట్లు, సంగమేశ్వర్ కు 52 ఓట్లు వచ్చాయి. ఎనిమిది ఓట్ల మెజార్టీతో సంగమేశ్వర్ విజయం సాధించారు.గెలిచిన అధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికల కమిటీ సభ్యులు మంగ శరత్ చంద్ర గౌడ్, బోనగిరి చంద్రశేఖర్, అల్లాడి శేఖర్, పొగాకు రామకృష్ణ, మహ్మద్ యూసుఫ్ ఆలీ ధ్రువపత్రాలు అందజేశారు.

### అంగన్‌వాడీ పోస్టులకు 186 దరఖాస్తులు



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ సిడిపిఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అంగన్ వాడీ పోస్టులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. సీడీపీఓ వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో మెదక్ ప్రాజెక్టు పరిధిలోని కొల్చారం, పాపన్నపేట మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా నిర్వహించిన వెరిఫికేషన్ కు అభ్యర్థుల నుంచి మంచి స్పందన లభించింది. మొత్తం 5 పోస్టులకు 186 మంది దరఖాస్తు చేయగా, 102 మంది వెరిఫికేషన్ కు హాజరైనట్లు సీడీపీఓ తెలిపారు. కొల్చారం మండలంలోని 2 పోస్టులకు 74 మంది దరఖాస్తు చేసుకోగా, 38 మంది హాజరయ్యారు. పాపన్నపేట మండలంలోని 3 పోస్టులకు 112 మంది దరఖాస్తు చేయగా, 64 మంది వెరిఫికేషన్ కు హాజరయ్యారు.

### బిజెపి కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీ

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :** భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా సిద్దిపేట జిల్లా కమిటీని బుధవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ప్రకటించారు.బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా వల్లపురెడ్డి రజనీకర్ రెడ్డి,ఉపాధ్యక్షులుగా తోకల శ్రీనివాస్ రెడ్డి,పరకాల తిరుపతిరెడ్డి,తోట సమ్మయ్య,ప్రధాన కార్యదర్శులుగా కంకణాల నర్సింహులు,కోదండం శ్రీనివాస్ రెడ్డి,కోశాధికారిగా గిరి నారాయణరెడ్డి,కార్యదర్శులుగా మర్కంటి ఏగొండ,వంటరి బుచ్చిరెడ్డి,సామల సురేష్ రెడ్డి,కార్యవర్గ సభ్యులుగా మూర్తి శ్రీనివాస్ రెడ్డి,పాతూరి శ్రీనివాసరెడ్డి,ఇర్రి మహిపాల్ రెడ్డి,ఆకుల శ్రీనివాస్,కాయిత రాజు,వంగ కరుణాకర్ రెడ్డి,జీడిపల్లి రజనీకర్ రెడ్డి,చందుపట్ల రవీందర్ రెడ్డి,కిష్టమనేని రమేష్ రెడ్డి,కూరెల్లి భాస్కర్ రెడ్డి,తక్కల్లపల్లి సంపత్ రావు,సోషల్ మీడియా కన్వీనర్ గా బైతి తిరుపతి నియామకమైనట్టు అధ్యక్షుడు ప్రకటించారు.

### సీఎన్‌సీ లేజర్ యంత్రంలో చిక్కుకుని కార్మికుడు మృతి



**ముద్ర, కాప్రా:** కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో ఉన్న సుదర్శన్ ఐరన్ ఫాబ్రికేషన్స్ కంపెనీలో బుధవారం జరిగిన పారిశ్రామిక ప్రమాదంలో ఓ కార్మికుడు మృతి చెందాడు. కంపెనీలోని మోల్డింగ్ సీఎన్‌సీ లేజర్ యంత్రం వద్ద విధులు నిర్వహిస్తున్న బత్తుల సురేష్ బాబు (42) ప్రమాదవశాత్తు యంత్రంలో చిక్కుకోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.సమాచారం అందుకున్న చర్లపల్లి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో ఫ్యాక్టరీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబ సభ్యుల రోదనలు అక్కడున్న వారిని కలచి వేశాయి. పారిశ్రామిక సంస్థల్లో కార్మికుల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని, యంత్రాల నిర్వహణ సమయంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్థానికులు, సహచర కార్మికులు కోరుతున్నారు.

### యాదగిరి నరసింహస్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజాసింగ్



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని బుధవారం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికగా ఆలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణలో అతిపెద్ద పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తే అది కేసిఆర్ కు పోతుందని అపోహలు వద్దన్నారు.యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధిపై ఓ భక్తుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆలయంలో మరింత అభివృద్ధి పనులు చేపట్టాలని, భక్తులకు మెరుగైన వసతి, పార్కింగ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. గతంలో కేసీఆర్ హయాంలో యాదాద్రి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారని, ప్రస్తుతం అదే స్థాయిలో అభివృద్ధి కొనసాగించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో కొత్త కాటేజీలు, మల్టీలెవల్ పార్కింగ్, రోప్‌వే వంటి ప్రాజెక్టులు చేపడితే యాదాద్రి పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆలయానికి వస్తున్న ఆదాయాన్ని అభివృద్ధి పనులకు వినియోగించాలని కోరారు.కొత్త ఆలయ ట్రస్ట్ బోర్డు అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని భక్తుడు విజ్ఞప్తి చేశారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555